Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699


అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 190 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 6 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

# కోడూరుపాడులో అయ్యప్ప స్వామి వారి వార్షిక జన్మదినోత్సవం

## - వీరవల్లి హైస్కూల్‌కు నడిచి వెళుతున్న విద్యార్థులకు సైకిళ్ళు బహుకరణ





**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో అయ్యప్ప స్వామి వారి 19వ వార్షిక జన్మదినోత్సవాన్ని గురువారం గ్రామంలో రామాలయం నందు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేకంగా చేయించిన ప్రసాదాన్ని అందజేశారు. అయ్యప్ప స్వామి పుట్టినరోజును పురస్కరించుకుని కోడూరుపాడు గ్రామం నుండి వీరవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రతిరోజూ నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్న ఐదుగురు విద్యార్థులను గుర్తించి వారికి ఐదు సైకిళ్లు చందు శ్రీనివాసరావు, చందు సాంబశివరావు (గుంటూరూ జిల్లా మంచల గ్రామం), మునకాల తాతారావు, వక్కలగడ్డ నాగేశ్వరరావు ప్రోత్సాహంతో గురువారం విద్యార్థులకు సైకిళ్లను అందజేసారు. ఈ సందర్భంగా చందు శ్రీనివాసరావు మాట్లాడుతూ నడిచి వెళుతూ కష్టపడుతున్న విద్యార్థులు చదువుకు సమయానికి పాఠశాలకు చేరుకోవడంలో ఈ సైకిళ్లు ఉపయోగపడతాయని అన్నారు. అలాగే వారు మరింత ఉత్సాహంతో చదువులో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. అందుకే ఈ సైకిళ్ళను అందిస్తున్నట్లు చందు శ్రీనివాసరావు తెలిపారు.

# 8న ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

## - మంత్రులు సవిత, సంధ్యారాణి - హాజరు కానున్న సీఎం చంద్రబాబు - మహిళల ఉపాధి కల్పనే లక్ష్యం 36 ఎంవోయూలు - నాలుగు ఎన్ఆర్ఎల్ఎం క్లస్టర్ల ప్రారంభం - డ్వాక్రా సంఘాలకు చెక్‌ల పంపిణీ - మహిళా లబ్ధిదారులకు వాహనాల అందజేత : మంత్రి సవిత



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఈ నెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రులు ఎస్.సవిత, గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని పేరెడ్స్ గ్రౌండ్‌లో జరగనున్న ఈ వేడుకల సందర్భంగా మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 36 ఎంవోయూలు చేసుకోనున్నట్లు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సెర్ప్, చేనేత, జౌళి శాఖ, సీఆర్డీయే, గుంటూరు జిల్లా అధికారులతో మంత్రులు సవిత, సంధ్యారాణి సమావేశం నిర్వహించారు. అమరావతిలోని పేరెడ్స్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ వేడుకలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరు కానున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మేలు కలిగేలా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలు తీర్చిదిద్దే క్రమంలో పలు ఒప్పందాలు చేసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం సమక్షంలో 36 ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలతో ల్యాప్ టాప్ బ్యాగులు, క్యారీ బ్యాగులు, రెడీ మేడ్ దుస్తుల తయారీకి శిక్షణివ్వడదానికి సెర్ప్‌తో ఆప్కో ఒప్పందం చేసుకోనున్నట్లు తెలిపారు. సీఎం చేతుల మీదుగా నాలుగు ఎన్ఆర్ఎల్ఎం క్లస్టర్లను ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఎమ్మిగనూరు (కర్నూలు), చీరాల (బాపట్ల), రాజాం (విజయనగరం), పొందూరు (శ్రీకాకుళం)లో ఈ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. మహిళా దినోత్స వేడుకల సందర్భంగా 23 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా డ్వాకా మహిళా సంఘాలకు రుణాల అందజేయనున్నామన్నారు. మిల్లెట్ కార్ట్‌లు 2, ఎగ్ కార్ట్‌లు 5, రైతు బజారు వ్యాన్ 1, బొలెరో వాహనాలు రెండు, ఆటోలు 5, ట్రాక్టర్లు 5, ర్యాపిడో ద్విచక్ర వాహనాలు 5 మహిళ లబ్ధిదారులకు సీఎం చంద్రబాబునాయుడు అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు, ఫ్రీ బస్, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలు అమలు చేశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్య కుమారి, సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ భార్గవ్ తేజ, గుంటూరు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో సమీక్ష





**(రాజధాని వార్తలు):** మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్లో సౌకర్యాలు అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం సమీక్ష నిర్వహించారు.

**పెమ్మసాని కామెంట్స్:**

లాస్ట్ ఇయర్ ఎయిమ్స్ రివ్యూ చేసాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎయిమ్స్‌లో ఉన్నటువంటి సమస్యలను ఎలా అధిగమించాలని అంశంపై గడిచిన రివ్యూలో సమీక్షించాం. ఎయిమ్స్‌ను ఆంధ్రప్రదేశ్‌కు ఒక గొప్ప రీసెర్చ్ అండ్ అకాడమిక్ ఇన్స్టిట్యూట్‌గా చేయాలనే ఉద్దేశంతో లాస్ట్ టైం రివ్యూ చేసిన తర్వాత ఫైనాన్స్ మినిస్ట్రీ దగ్గర తీసుకెళ్లి దాదాపుగా 500 ప్లస్ పోస్టులను తీసుకు రాగలిగాం. టోటల్గా శాంక్షన్ అయినటువంటి పోస్టలలో, ఇప్పటివరకు 1661 ఎక్సిస్టింగ్ పోస్ట్ ఫిల్ అయ్యాయి. ఈ ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్‌కి సంబంధించి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అదే విధంగా ఎకనామికల్లీ వీకర్ సెక్షన్‌కి ఒక 10%, ఈ రిజర్వేషన్ కింద 45% ఫిల్ చేయాలి. ఉన్న రిజర్వేషన్లకు అనుగుణంగా భర్తీ చేయాలి. ఇది రిక్రూట్మెంట్ వాల్యూమ్ వచ్చేటప్పటికి చాలా విపరీతంగా పెరిగింది. 2024లో 22 వేలు అయితే, 2025లో 28 వేలకు పెరిగింది. లాస్ట్ టైమ్ 12 ఆపరేషన్ థియేటర్స్ ఉంటే 87 థియేటర్స్ ఇపుడు ఉన్నాయ్. ఐసియు 38 అప్పట్లో ఉంటే ఇపుడు మరిన్ని రెట్లు పెరిగాయి. బ్లడ్ టెస్ట్‌లో కొన్ని టెస్టులకు మాత్రం ఆలస్యం అవుతుంది తప్పా, అన్నీ ఆలస్యం కావడం లేదని అధికారులు చెబుతున్నారు. గతంలో మూడు ఫార్మసీ కౌంటర్లు ఉంటే ఇప్పుడు మూడు నుంచి ఏడు ఫార్మసీ కౌంటర్లు పేషంట్లకు అందుబాటులో ఉన్నాయి. బస్సు షెల్టర్ కావాలంటే అందుబాటులోకి తీసుకు వచ్చాము. లాస్ట్ టైమ్ గడ్కరీని అడిగి హైవే నుంచి వచ్చేవాళ్ళకు అనుకూలంగా ఉండేలా ర్యాంప్ నిర్మాణానికి అనుమతులు తీసుకున్నాం. అది కూడా టెండర్ స్టేజెస్‌లో ఉంది, అది కూడా కంప్లీట్ అవుతుంది.

# ముంబయిలో సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్, బ్రాహ్మణి దంపతులు










**ముంబయి:** క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు హాజరయ్యారు. ఈ ఉదయం ముంబయి చేరుకున్న మంత్రి లోకేష్ దంపతులు అక్కడ సెయింట్ రెజిస్ హోటల్ లో జరిగిన సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహ మహోత్సవంలో పాల్గొన్నారు. సచిన్ టెండూల్కర్ కుటుంబం మంత్రి లోకేష్ దంపతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్‌లను ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకకు దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తరలి వచ్చారు.

# వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే

## - ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 30 ఏళ్లు అవుతున్నా సందర్భంగా సీఎం చంద్రబాబు ఎక్స్‌లో స్పందన - 1996 మార్చి 5...ఆ రోజు నాకు ఇంకా గుర్తుంది అంటూ వ్యాఖ్య



**(రాజధాని వార్తలు):** 1996 మార్చి 5....ఆ రోజు నాకు ఇంకా గుర్తింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడు తుంటే....వారి కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం తొలి అడుగు వేసిన రోజు అది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో...శ్రీశైలం ప్రాజెక్టు జలాశయం ఫోర్ షోర్ నుండి 43.50 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలనే ఆలోచనతో...30 ఏళ్ల క్రితం ఇదే రోజున (1996 మార్చి 5న) ముఖ్యమంత్రిగా నేను వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను. అనేక కారణాలతో తరువాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలైన వెలిగొండ పనులను మళ్లీ 2014-19 మధ్య వేగవంతం చేశాము. ప్రాజెక్టు కోసం నాడు రూ.1,414 కోట్లు ఖర్చు పెట్టాం. తరువాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం అంటూ ప్రజలను మోసం చేసి నవ్వులపాలు అయ్యింది. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు పనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చాం. రూ.140 కోట్లతో పెండింగ్ బిల్లులు క్లియర్ చేశాం. రూ.585 కోట్లు ప్రాజెక్టు నిర్మాణంపై ఖర్చు చేశాం. హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది జులై నాటికి తొలి ఫేజ్ పనులు పూర్తి చేసి వెలిగొండకు కృష్ణా నీళ్లు తీసుకొస్తాం. 2027-28 నాటికి ఫేజ్-2 నిర్మాణం కూడా పూర్తి చేస్తాం. ప్రజల దశాబ్దాల కలను నిజం చేసి...కరువు ప్రాంతంలో ప్రతీ ఎకరానికి నీళ్లిచ్చి...రైతన్నల జీవితాలు మారుస్తాం. హార్టికల్చర్ సాగుతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతాం. వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే...పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే అని ప్రకటిస్తున్నాను.

# దురాచారాలను ప్రక్షాళన చేయాలి

## - అంగన్వాడీ సేవలు అమూల్యం : మత్తు పదార్థాలను అరికట్టాలి




**హనుమాన్ జంక్షన్, (రాజధాని వార్తలు):** డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గర్భస్త పిండ లింగ నిర్ధారణ, వరకట్నం వంటి దురాచారాలను సమూలంగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కళా భారతి కల్చరల్ సొసైటీ బృందం గురువారం హనుమాన్ జంక్షన్ హనుమాన్ దేవాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ పర్యవేక్షణలో ఈ కళా భారతి జాతాను ఏర్పాటు చేశారు.అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వివిధ రకాల సేవలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే.శాంతి శిరీష, సుమిత్ర, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ టీచర్స్,హెల్త్ డిపార్ట్మెంట్, తల్లులు కళా భారతి కళాకారులు ఎం. ప్రశాంత్ కుమార్,ఎం. తిరుపతి బాలాజీ సభ్యులు పాటల ద్వారా హాస్యం ద్వారా తమ నటన ద్వారా చక్కగా అలంకరించారు.

# ఆంధ్రప్రదేశ్ పోస్టు గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదల

## - 2026-27 విద్యా సంవత్సరానికి పీజీ ప్రవేశాలపై కీలక వివరాలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు మరియు అనుబంధ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే Andhra Pradesh Post Graduate Common Entrance Test (APPGCET-2026) నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు కళలు, శాస్త్రాలు, వాణిజ్యం మరియు ప్రొఫెషనల్ కోర్సులకు ఈ ప్రవేశ పరీక్ష ఆధారంగా అడ్మిషన్లు నిర్వహించనున్నారు.

ముఖ్యమైన తేదీలు – గడువులు

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:

ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు చివరి తేదీ: మార్చి 9

ఆలస్య రుసుముతో దరఖాస్తు గడువులు:

రూ. 1,000తో – మార్చి 13 వరకు, రూ. 2,000తో – మార్చి 16 వరకు, రూ. 4,000తో – మార్చి 19 వరకు, రూ. 10,000తో – మార్చి 23 వరకు,

దరఖాస్తు సవరణ : మార్చి 24, 25

పరీక్షల షెడ్యూల్

హాల్ టికెట్లు డౌన్‌లోడ్: ఏప్రిల్ 21 నుంచి

పరీక్షా తేదీలు: మే 5 నుండి మే 11 వరకు

ప్రతిరోజూ మూడు సెషన్లు:

ఉదయం 9.00 – 10.30

మధ్యాహ్నం 12.30 – 2.00, సాయంత్రం 4.00 – 5.30

విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న కోర్సులు

పీజీ కోర్సులు

కళలు & వాణిజ్యం:

M.A. ఇంగ్లీష్, తెలుగు, పొలిటికల్ సైన్స్ & పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, M.Com (బ్యాంకింగ్ & ఫైనాన్స్), మీాఔ

సైన్స్ విభాగాలు:

వీ.వాఫి. మెరైన్ బయాలజీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫుడ్ టెక్నాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఆయిల్ & ఫ్యాట్స్ టెక్నాలజీ,

ఇతర కోర్సు:

M.P.Ed

ప్రొఫెషనల్ కోర్సులు

ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కింది కోర్సులు నిర్వహిస్తున్నారు.

కావలి క్యాంపస్‌లో అవకాశాలు

విశ్వవిద్యాలయ పరిధిలోని కావలి క్యాంపస్‌లో కూడా పలు ముఖ్య కోర్సులు అందుబాటులో ఉన్నాయి:

రెగ్యులర్ కోర్సులు:

M.A. ఎకనామిక్స్, M.Com, M.Sc. బోటనీ, జువాలజీ, మ్యాథమెటిక్స్,

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు:

M.Sc.కంప్యూటర్ సైన్స్,

అధికారుల సూచనలు

Vikrama Simhapuri University డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎం.హనుమారెడ్డి మాట్లాడుతూ, అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ప్రమాణాలు, సిలబస్, ఫీజు నిర్మాణం మరియు ఇతర పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ముఖ్య గమనిక:

ఈ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తిగా ప్రవేశ పరీక్ష మెరిట్ మరియు ప్రభుత్వ నిబంధనల ఆధారంగానే జరుగుతాయి. ఆసక్తి గల అభ్యర్థులు సమయానికి దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# కోవూరు నియోజకవర్గం పారిశ్రామిక స్వర్గధామం

## - 2026-27 బడ్జెట్‌లో పారిశ్రామిక అభివృద్ధికి 3 వేల 161 కోట్లు, యువత నైపుణ్యాభివృద్ధికి రూ. 12 వందల 32 కోట్లు కేటాయించడం శుభపరిణామం - కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఇఫ్కో కిసాన్ సెజ్ పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది - 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా చట్టబద్ధమైన హామీ ఇవ్వాలి - బొడ్డువారి పాలెం ఏపీఐఐసీ సెజ్ లో భూములు తీసుకుని పరిశ్రమలు నెలకొల్పకుండా ఖాళీగా ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలి - నెల్లూరు జిల్లాను ఇండస్ట్రీ హబ్‌గా మార్చేందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిరంతర కృషి - శాసనసభ సమావేశాలలోఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో 2026–27 బడ్జెట్ ఒక చారిత్రాత్మక మలుపు అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొనియాడారు. పారిశ్రామిక అభివృద్ధికి 3వేల 161 కోట్లు, యువత నైపుణ్యాభివృద్ధికి 1వేల 332 కోట్లు కేటాయించడం శుభపరిణామమని ఆమె పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోయిన దుస్థితి నుంచి, నేడు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాల వల్ల అంతర్జాతీయ సంస్థలు ఏపీ వైపు చూస్తున్నాయని ఆమె అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. ముఖ్యంగా కోవూరు నియోజకవర్గంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ప్రశాంతి రెడ్డి వివరించారు. దాదాపు 10 వేల 705 కోట్ల భారీ పెట్టుబడులతో ఆరు దిగ్గజ సంస్థలు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు రావడం గర్వకారణమన్నారు. మార్చి 1న శంకుస్థాపన చేసుకున్న గాయత్రి రెన్యూవబుల్ ఎనర్జీ 260 కోట్లతో పాటు, టాటా సోలార్ ప్లాంట్ 6 వేల 675 కోట్లు, ప్రైమ్ ఆసియా ఫుట్‌వేర్ 600 కోట్లు, ఐఎఫ్ఎఫ్ మెడికల్ కెమికల్స్ 300 కోట్లు, శ్యామ్ మెటాలిక్స్ 2 వేల 500 కోట్లు మరియు రామ్సే బయో ఇథనాల్ 370 కోట్ల రూపాయలతో కిసాన్ సెజ్ పరిశ్రమలు నెలకొల్ప బోతున్నాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. ఈ అద్భుత ప్రగతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌ల సమర్థతకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఇఫ్కో కిసాన్ సెజ్ భూములు ఇచ్చి ఇక్కడ పరిశ్రమలు వస్తాయని 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల కలలు నెరవేరుతున్నాయని, గతంలో తెలుగుదేశం హయాంలో వచ్చిన సీమెన్స్ గమేషా మినహా అక్కడ మరే పురోగతి లేదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ప్రారంభించనున్న పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సెజ్ పరిధిలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, నిరంతర విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా కొడవలూరు మండలం బొడ్డువారి పాలెం ఏపీఐఐసీ సెజ్‌లో భూములు తీసుకుని పరిశ్రమలు నెలకొల్పకుండా ఖాళీగా ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. విలువైన భూములు పొంది ఉపాధి కల్పించని వారి నుంచి భూములు వెనక్కి తీసుకుని నిజమైన పారిశ్రామికవేత్తలకు కేటాయించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. నెల్లూరు జిల్లాను ఇండస్ట్రీ హబ్‌గా మార్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృషి ఫలితంగా రామాయపట్నంలో రానున్న లక్ష కోట్ల బీపీసీఎల్ రిఫైనరీ, మూతపడిన కోవూరు షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు జరుగుతున్న ప్రయత్నాలు జిల్లా భవిష్యత్తును మారుస్తాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో నడిపించగల ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా కొనియాడారు.

# అసౌకర్యాలు కలగకుండా రథోత్సవం ఏర్పాట్లు : మేయర్ దేవరకొండ సుజాత





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ, విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నగరపాలక సంస్థ నుంచి ప్రణాళికబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ దేవరకొండ సుజాత తెలిపారు. రథోత్సవం ట్రయల్ రన్ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక రంగనాయకులపేట దేవస్థానం మాడవీధిలో నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ పారిశుద్ధ్య నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, టౌన్ ఏ.ఎస్పి దీక్ష ఐ.పి.ఎస్,. పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి నారాయణ ఆదేశాల మేరకు రథోత్సవ నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. రథోత్సవానికి పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నగరపాలక సంస్థ, పోలీసు విభాగం, దేవాదాయ శాఖలను సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ దేవస్థానం ప్రాంగణంలో అన్నప్రసాదాల వితరణ కేంద్రం, మజ్జిగ పంపిణీ, మంచినీటి తాగునీరు సరఫరా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసి సిబ్బందితో పర్యవేక్షిస్తున్నామని వివరించారు. దేవస్థానం ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం వాటిల్లకుండా భక్తులకు అన్ని ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం, మాడ వీధుల్లో పరిశుభ్రత, డ్రైను కాలువల్లో పూడికతీత పనులు, సిల్ట్ తీసివేయడం, బ్లీచింగ్, సున్నం చల్లటం, దోమల నివారణకు ప్రత్యేకంగా ఫాగింగ్ చేపట్టడంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ లను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ ఉంచాలని శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఏ.ఎస్పీ దీక్ష ఐ.పి.ఎస్,. మాట్లాడుతూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా అన్ని ప్రాంతాలలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి రథోత్సవం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రథోత్సవం జరిగే ప్రాంతంలో వాహనాలలో ప్రయాణం నిషేధం అమలులో ఉందని, ప్రజలంతా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సాధికారిక వారోత్సవాల్లో భాగంగా ఆత్మరక్షణ శిక్షణ నిర్వహణ : ఎస్‌పి అజిత వేజెండ్ల






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మహిళా సాదికారిక వారోత్సవాలను పురస్కరించుకొని, జిల్లా ఎస్‌పి. అజిత వేజెండ్ల, ఐపిఎస్ ఆదేశాల మేరకు, సంబంధిత డిఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో మహిళలకు, మరియు చిన్నపిల్లలకు "సామూహిక ఆత్మరక్షణ శిక్షణ" అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని స్కూల్, కాలేజీలో ఆ పోలీసు స్టేషన్‌లో ఉన్న సిబ్బంది పెద్ద ఎతున్న ఆత్మరక్షణ శిక్షణని నిర్వహించారు. నెల్లూరు హెడ్ క్వార్టర్ నందు అడిషనల్ ఎస్పీ సిహెచ్.సౌజన్య సూచనలు మేరకు డికెడబ్ల్యూ కాలేజీలో ఏఆర్ డిఎస్పీ, సిఐలు దర్గా మిట్ట పిసిఆర్, ఆర్ఐ వెల్ఫేర్ మరియు కరాటే నిపుణుల ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం జరిగింది. స్వీయ–రక్షణ (ఆత్మరక్షణ) అనేది ఒక ప్రతిఘటన, ఇందులో హాని నుండి ఆరోగ్యం మరియు శ్రేయస్సును కాపాడుకోవడం ఉంటుంది. ప్రమాద సమయాల్లో బలప్రయోగానికి చట్టపరమైన సమర్థనగా స్వీయ–రక్షణ హక్కును ఉపయోగించడం అనేక అధికార పరిధిలో అందుబాటులో ఉంది. శారీరక స్వీయ–రక్షణ అంటే హింస యొక్క తక్షణ ముప్పును ఎదుర్కోవడానికి భౌతిక శక్తిని ఉపయోగించడం. అలాంటి శక్తి సాయుధంగా లేదా నిరాయుధంగా ఉండవచ్చు.అనేక స్వీయ రక్షణ కళల శైలులు ఆత్మరక్షణ కోసం అభ్యసించబడతాయి. ప్రధానంగా ఆత్మరక్షణ కోసం శిక్షణ పొందుతాయి, పోరాట క్రీడలు ఆత్మరక్షణ కోసం సమర్థవంతంగా అన్వయించబడతాయి. కొన్ని స్వీయ రక్షణ కళలు పరిస్థితి నుండి ఎలా తప్పించుకోవాలో నుండి ఎలా నేర్పుతాయి, మరికొన్ని దాడి ఎలా చేయాలో నేర్పుతాయి. అనేక ఆధునిక యుద్ధ కళల పాఠశాలలు ఇప్పుడు మరింత ఆచరణాత్మక స్వీయ–రక్షణను ఉపయోగిస్తున్నాయి. ఆత్మరక్షణ విద్యతరగతులలో క్రమపద్ధతిలో బోధిస్తారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్న పిల్లలు పెద్ద ఏత్తున పాల్గొని ఆత్మ రక్షణా విద్యని నేర్చుకోవడం జరిగింది.

# విద్యార్థినుల ఆత్మ రక్షణకు కరాటే శిక్షణ తప్పనిసరి : ఎస్సై మనోజ్ కుమార్

**గూడూరు, (రాజధాని వార్తలు):** విపత్కర పరిస్థితుల్లో రక్షణ కొరకు విద్యార్థినిలు చిన్నతనం నుండే కరాటేలాంటివి శిక్షణ పొందాలని గూడూరు ఒకటో పట్టణ ఎస్సై మనోజ్ కుమార్ వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మనోజ్ కుమార్ విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు సెల్ఫ్ డిఫెన్స్‌ను పెంచుకోవాలని కరాటే లాంటివి నేర్చుకోవడం వల్ల రక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



# రంగడికి టిటిడి పట్టు వస్త్రాలను సమర్పించిన వేమిరెడ్డి

## - కన్నుల పండుగగా రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రంగనాయకుల పేటలో వేంచేసి యున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తరఫున వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానాల నుండి వచ్చిన పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. స్వామివారి కల్యాణ వేడుకలు తిలకించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాద వినియోగాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ లెక్కల



వెంక రెడ్డి ఈవో శ్రీనివాసులురెడ్డి పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని పరిశీలించిన ఎంపీ విపిఆర్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నవాబుపేటలో ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని నవాబ్‌పేటలో ఉన్న ఆర్యవైశ్య మహాలక్ష్మీ అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం పునః నిర్మాణంపై కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల చరిత్ర ఉన్న ఆలయాన్ని భక్తుల సహకారంతో పునః నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. 2024 ఏప్రిల్‌లో ఆలయ పునః నిర్మాణ పనులు మొదలు పెట్టారని, కొనసాగుతున్నాయన్నారు. ఇంత మంచి ఆలయాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో టిటిడి దృష్టిలో పెడితే తప్పకుండా తగిన సహాయం అందుతుందని సూచించారు. శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆశీసులతో పనులు త్వరగా పూర్తయి భక్తులకు ఆలయం అందుబాటులోకి రావాలని, అమ్మవారి దీవెనలు ప్రజలపై ఉండాలన్నారు. అంతకుముందు ఉస్మాన్ సాహెబ్ పేటలో ఉన్న సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నుడా మాజీ ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ కమిటీ అధ్యక్షులు సుదర్శన్, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, సాయిరాం సుధాకర్, ఆర్యవైశ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి కుంభకోణ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**- నిందితుల నుండి సొమ్ము మొత్తాన్ని రికవరీ చేయాలి - ఎల్ఐసి పై ప్రజలుగా నమ్మకాన్ని నిలబెట్టాలి : సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**

**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం ఎల్ఐసి బ్రాంచ్ కేంద్రంగా జరిగిన ఒక కోటి 50 లక్షల కుంభకోణంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అతిపెద్ద కుంభకోణానికి సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని నిందితులు కాజేసిన సొమ్ము మొత్తం రికవరీ చేయాలని సిపిఐ ఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. భద్రాచలం ఎల్ఐసి బ్రాంచ్‌లో ఒక కోటి 52 లక్షల రూపాయల క్లైమ్ కుంభకోణంపై మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎల్ఐసి పై ప్రజలు ఎంతో విశ్వాసం కలిగి ఉంటారని తాము కష్టపడి సంపాదించి దాచుకుండే సొమ్ముకి భద్రత భరోసా ఉంటుందని నమ్మి ఎల్ఐసిలో పెట్టుబడులు పెడుతుంటారని అటువంటి ప్రజల నమ్మకాన్ని కొల్లగొట్టే ఇటువంటి చర్యలపై ఎల్ఐసి అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. గతంలో సైతం భద్రాచలం బ్రాంచ్పై ఇటువంటి ఆరోపణలే వచ్చిన నేపథ్యంలో సంఘటనకు పరోక్షంగా సహకరించిన అధికారులపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకే మండలం నుండి అతి తక్కువ సమయంలో 29 మంది మృతి చెందినట్లు చూపిస్తూ క్లైమ్‌లు చేస్తుంటే క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడం ఇటువంటి కుంభకోణాలకి పరోక్షంగా సహకరించడమేనని అన్నారు. రోజువారి కూలీలు పేదలు మధ్యతరగతి ప్రజలు ఎల్ఐసిపై ఎంతో నమ్మకముతో కష్టపడి సంపాదించిన సొమ్ముని పెట్టుబడిగా పెడుతున్నారని అటువంటి పేదల ప్రజల సొమ్ముపై బాధ్యత లేకుండా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. ఒకరిద్దరు ఇటువంటి అవినీతి ఏజెంట్లతో సంస్థకే చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసిన అశ్వాపురం రెవిన్యూ పంచాయతీ అధికారులపై సైతం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్ఐసి సొమ్మును మోడీ ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలలో పెట్టుబడి పెట్టి అలజడి సృష్టిస్తుంటే స్థానికంగా ఉన్న అధికారుల సైతం అక్రమాలకు తోడ్పాటును అందిస్తుంటే భారతీయ బీమా సంస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సడలిపోతుందని మచ్చ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ఎల్ఐసిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇటువంటి చర్యలు పునరావతం కాకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మచ్చ కోరారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం ప్రజా పోరాటాల నిర్వహించే మార్క్సిస్టు పార్టీ వాటిలో జరిగే తప్పులను సైతం ప్రశ్నిస్తుందని మచ్చ స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఎల్ఐసి అధికారులు మేల్కొని భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపట్టాలని నిందితులను కఠినంగా శిక్షించి మొత్తం సొమ్మునే రికవరీ చేసి ఎల్ఐసి పై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టాలని మచ్చ వెంకటేశ్వర్లు కోరారు.




# స్వీయ రక్షణ మెలకువలను నేర్చుకోవాలి : సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ఏ.వి.రమణ





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఈనెల 8వ తేదీన జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సి.ఐ జి ఏ వి రమణ ఆధ్వర్యంలో గజపతినగరం సర్కిల్ పరిధిలో వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ వారోత్సవాలలో భాగంగా గజపతినగరం బాలికోన్నత పాఠశాలలో మాస్టర్ టి.సాయికుమార్ విద్యార్థినిలకు స్వీయ రక్షణ మెలకువలను నేర్పించారు. స్వీయ రక్షణ మెలకువలను టి.సాయికుమార్ తనను అనుకరింప చేస్తూ విద్యార్థినులకు నేర్పించారు. ఈ సందర్భంగా సి.ఐ జిఏవి రమణ మాట్లాడుతూ విద్యార్థినిలు తాము అభ్యసించిన స్వీయ రక్షణ మెలకువలను అనునిత్యం సాధన చేయాలని సూచించారు. తాము అభ్యసించిన మెలకువలను అత్యవసర, ప్రమాదకర పరిస్థితులలో ఉపయోగించడం ద్వారా ఆత్మరక్షణ పొందాలని సి.ఐ రమణ విద్యార్థినులకు తగు సూచనలు చేశారు. స్వీయ రక్షణ మెలకువల కార్యక్రమంలో గజపతినగరం సబ్ ఇన్స్పెక్టర్ కే కిరణ్ కుమార్ నాయుడు, బాలికోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు టి.శ్రీనివాసరావు, పాఠశాల బోధనా సిబ్బంది, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.



# విక్రమ సింహపురి వర్సిటీలో 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్' 2026 గోడపత్రికల ఆవిష్కరణ




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దేశ పాలనా వ్యవస్థలో యువతను భాగస్వాములను చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం సాయంత్రం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు ఆవిష్కరించారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ మరియు మై భరత్ కేంద్ర సంయుక్తంగా నెల్లూరు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువలపై అవగాహన ముఖ్యం. ఉపకులపతి ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితికి 50 ఏళ్లు: భారత ప్రజాస్వామ్య పాఠాలు అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. యువత దేశ నిర్మాణంలో కీలక శక్తిగా ఎదగాలని, రాజ్యాంగ విలువలను అర్థం చేసుకుని ఆచరణలో పెట్టడం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కాలం నాటి రాజకీయ పరిణామాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, మౌలిక హక్కులు మరియు మీడియా స్వాతంత్ర్యం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

**యువతకు ఇదొక ఉత్తమ వేదిక: రిజిస్ట్రార్**

యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.కె.సునీత మాట్లాడుతూ, యువతలో ప్రజాస్వామ్య స్ఫూహను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఒక గొప్ప వేదిక అని కొనియాడారు. సమకాలీన అంశాలపై చర్చించడం ద్వారా భారత ప్రజాస్వామ్య ప్రయాణాన్ని విద్యార్థులు సమగ్రంగా అర్థం చేసుకోగలరని, చర్చలు మరియు వాదోపవాదాల ద్వారా తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచాలని ఆమె కోరారు.

**మార్చి 9లోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి**

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.అల్లం ఉదయశంకర్ మాట్లాడుతూ, వికసిత భారత్ లక్ష్యసాధనలో యువశక్తి పాత్ర కీలకమని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ కింది విధంగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్లాట్‌ఫారమ్: మై భారత్ వెబ్‌సైట్. విభాగం: 'Mega Events' లోకి వెళ్లి తమ జిల్లా పరిధిలోని 'Micro Evens' కింద నమోదు చేసుకోవాలి. చివరి తేదీ: మార్చి 9, 2026. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్. విజయ, District Youth Officer A Mahendra Reddy, My Bharat Kendra Nellore NSS ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.నాగభూషణరావు, డా. సుచరిత, డాక్టర్ బి వి సుబ్బారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, అధ్యాపకులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మా తలరాతలు మార్చండి...దయచేసి కడుపు కొట్టొద్దు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో నెల్లూరు నగర మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షురాలు పిల్లి మెట్ల అరుణ మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా మహిళలు సభ్యులుగా ఏర్పడి నిర్వహిస్తున్న చేపల మార్కెట్ మున్సిపల్ సహకారంతో నిర్మించుకున్న కొత్త భవనం నందు గత సంవత్సరం ఎనిమిది లక్షల రూపాయలకు సంవత్సర కాలానికి నెల్లూరు నగర మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం హక్కులు తీసుకొని నిర్వహిస్తుందని కానీ నేడు మున్సిపల్ కమిషనర్ బహిరంగంగా మార్కెట్ వేలం ప్రకటించడం తగదని ఎన్నో సంవత్సరాలుగా వీటి మీద జీవనం సాగిస్తున్న తమకు 3 శాతం అనగా 8 లక్షల 25 వేల రూపాయలకు కేటాయించాలని మార్కెట్లో తూకాలు మోసాలు లేకుండా నిర్వహిస్తున్నామని మున్సిపల్ అధికారులు చేపలు శుభ్రపరచుటకు తీసుకోవలసిన రేట్లను వారే ప్రకటించి ప్రజలకు తెలియజేసే విధంగా పోస్టర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. కావున ప్రభుత్వ అధికారులు మత్స్యకారుల సహకార చట్టం ప్రకారం మాకు కేటాయించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, కామేశ్వరమ్మ, దేవి, సుధా లక్ష్మి, కవిత, సుజాత, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ప్రారంభమైన ఆలయ ప్రతిష్టా మహోత్సవం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ సుదర్శన నారసింహస్వామి వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది బుధవారం ఉదయం శ్రీ విష్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యాహవాచనము, పరిషత్, ఋత్విక్ వరుణ, రక్షబంధనము, అంకురార్పణ, యాగశాలార్చన, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తు, యోగేశ్వర, లక్ష్మీనారాయణ మంటప ఆవాహనలు, నిత్య విశేష హవనములు, మంగళాశాసనము భక్తిశ్రద్ధలతో గావించారు. వేదమంత్రాలు నడుమ జరిగిన ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు దుర్గా అశ్విన్, స్వప్న, రమ్య, నీరజ మన్నే తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఉయ్యాల ప్రవీణ్

**- తడలో ప్రారంభమైన జనసేన పార్టీ ఉద్యమి నమోదు కార్యక్రమం**

**తడ, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తడ మండలంలోని తడ కండ్రిగ గ్రామ పంచాయితీలో జనసేన పార్టీ ఉద్యమి నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న పలువురు జనసేన ఉద్యమి నమోదు చేయిం చుకున్నారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో విస్తృతంగా జనసేన పార్టీ ఉద్యమి నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. జనసేన పార్టీ ఉద్యమి నమోదు చేయించుకున్న వారికి పార్టీలో గుర్తింపు తోపాటు ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కలుగుతుందని తెలియజేశారు. ఉత్సాహవంతులైన యువతను పార్టీ ఆహ్వానిస్తుందని అన్నారు. పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యత నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తడ మండల జనసేన పార్టీ నాయకులు గురునాద్, కుమరేష్, గురు, నిఖిల్ పాల్గొన్నారు.



# సంపాదకీయం


## ఇద్దరు విలన్ల మధ్య అంతిమ యుద్ధం

మిడిల్ ఈస్ట్‌లో జరుగుతున్న యుద్ధం ఇద్దరు విలన్‌ల మధ్య జరుగుతున్న క్లైమాక్స్ ఫైట్ లాంటిది. ఒక విలన్ మరణించినా, మరో విలన్ గెలిస్తే అందరూ మరో విపత్తుకు సిద్ధం కావాల్సిందే! చరిత్ర చూస్తే ఇరాన్‌లో ఖమేనీ అస్తిత్వానికి ఏర్పాట్లు చేసిందే అమెరికా. అమెరికాతో దోబూచులాడబట్టే ఖమేనీ ఎదిగాడు! డీక్లాసిఫైడ్ డాక్యుమెంట్స్ మీద గార్డియన్, బీబీసీ చేసిన రీసెర్చ్ మేరకు మిలిటరీ తిరుగుబాటు మళ్లీ జరగకుండా అమెరికాతో ఖమేనీ నిగూఢ ఒప్పందం చేసుకున్నాడు, ఆ మేరకు 1979లో ఇరాన్‌కు తిరిగి వచ్చి నాయకుడు కాగలిగాడు. ఇవి గ్లోబల్ పాలిటిక్స్. ఇవి మన దేశ రాజకీయాల కంటే అసహ్యంగాను ఆశ్చర్యకరంగానూ ఉంటాయి. ఇజ్రాయెల్ శత్రువైన హమాస్‌కు స్థావరాన్ని ఇచ్చి, రక్షణ కల్పించిన దేశం ఖతార్. ఇప్పుడు ఇదే ఖతార్‌పై ఇజ్రాయెల్ ఆజన్మశత్రువు ఇరాన్ దాడి చేసింది. ఇజ్రాయెల్‌కు యుద్ధ భాగస్వామి అయిన అమెరికా అదే ఇజ్రాయెల్ శత్రుదేశమైన ఖతార్‌లో తన ఎయిర్ బేస్ పెట్టుకుంది. ఇప్పుడు దాని మీద ఇరాన్ దాడి చేసింది. ఇవన్నీ గ్లోబల్ పెత్తనం కోసం రకరకాలుగా ఏర్పడే సమీకరణాలు. దీన్ని గ్లోబల్ పాలిటిక్స్‌లో భాగంగా కాక ముస్లింల మీద దాడిగా చూసేవాళ్ళు గమనించాల్సింది ఏమిటంటే, అమెరికా?ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్ జరిపిన దాడులన్నీ ముస్లిం దేశాలైన ఖతార్, బహ్రెయిన్, దుబాయ్‌లపైనే! 1965లో ఖమేనీ ఇరాక్‌లో తల దాచుకుంటే అక్కడి నుంచి వెళ్లగొట్టింది ఇంకో అమెరికా వ్యతిరేక ముస్లిం నాయకుడు సద్దాం హుస్సేన్. సద్దాం హుస్సేన్ తరిమేస్తే ఖమేనీ తలదాచుకున్న దేశం ఫ్రాన్స్. అలా ఒక సెక్యులర్ దేశం మాత్రమే ఖమేనీకి గూడు కల్పించింది. ఖమేనీకి బతకడానికి సెక్యులర్ దేశం కావాలి, పాలించడానికి మాత్రం మత ఛాందసదేశం కావాలి. అలానే గమనిస్తే? ప్రపంచంలో ముస్లింలు అధికంగా వలస వెళ్లిన దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రెండూ అమెరికా మిత్ర దేశాలే. ఎంత ద్వేషించినా ముస్లిం దేశాల నుంచి వలసపోయే వాళ్ళు సౌదీ, యూఏఈ తర్వాత ప్రాధాన్యం ఇచ్చే దేశం అమెరికానే. ప్రపంచంలో, ఒకపక్క ద్వేషిస్తూనే మరోపక్క అక్కడే సెటిల్ అవ్వాలని కలలు కనే దేశం ఏదన్నా ఉంటే అది అమెరికానే! ఈ ప్రపంచ పెత్తందారీ రాజకీయాలలో ఖమేనీని బలిపశువు అనుకోవటం సరికాదు. ఈ రాజకీయాలలో అతనూ ఒక ప్రధాన పాత్ర పోషించినవాడే. కుర్ద్‌లో సున్నీ ముస్లింల స్వయంప్రతిపత్తి కోసం జరిగిన తిరుగుబాటును నిర్దాక్షిణ్యంగా అణచివేసిన వాడు ఖమేనీ. సెప్టెంబర్ 16, 2022న ఇరవై రెండేళ్ళ ఒక అమ్మాయిని కేవలం హిజాబ్ సరిగా వేసుకోలేదన్న కారణంగా చంపించినవాడు. పూర్తి షరియా 'లా' రూపొందించి మహిళల స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపిన ఘనుడు. 'జాన్, జిందగీ, ఆజాదీ' నినాదాలతో వెల్లువెత్తిన ప్రజా ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని చూసి విఫలమైనవాడు. ఒక్క సంవత్సరంలోనే ఈ తిరుగుబాటుకు సంబంధించి ఎన్నో కిడ్నాప్‌లు, అరెస్టులు, చిత్రహింసలు, హత్యలు చేయించాడు. గాజా యుద్ధంలో 75 వేల మందిని చంపడానికి ఇజ్రాయెల్‌కు రెండేళ్ళు పట్టింది. కానీ ఇరాన్ ఒక్క ఏడాదిలోనే స్వంత ప్రజలను 50 వేల మందిని చంపింది. అలాగని అక్కడ ఖమేనీని దేవుడిలా కొలిచేవాళ్ళు లేరని కాదు. ఎంత నియంతృత్వ పాలనలో అయినా ఆ నియంతను ఆరాధించే ప్రజలు ఉండనే ఉంటారు. హిట్లర్‌ను ఆరాధించిన ప్రజలూ అప్పట్లో లక్షల్లో ఉన్నారు. ఇదీ అంతే! ఇక అమెరికా విషయానికి వస్తే? ఇరాన్ ప్రజలు ఖమేనీ నిరంకుశ పాలనలో ఎన్నో అగచాట్లు పడుతున్నారన్నది ఒక కారణంగాను; ఇరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయన్నది రెండో కారణంగాను చూపించి ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై ఈ దాడి చేసింది. ఇరాన్ ప్రజల మీద అమెరికాకు ఎందుకంత గొప్ప ప్రేమ? ఒకప్పుడు 'మోస్ట్ వాంటెడ్'గా అమెరికా డిక్లేర్ చేసిన మాజీ టెర్రరిస్ట్ అహ్మద్ అల్ షరా అధ్యక్షుడిగా కొనసాగుతున్న సిరియా కూడా నిరంకుశ పాలనలోనే ఉంది. అయితే ఈ నియంతను ట్రంప్ నిస్సిగ్గుగా 'బ్యూటిఫుల్ మేన్' అని అభివర్ణించి సిరియాపై ప్రేమ కురిపిస్తున్నాడు. ఛాందసవాద ముస్లిం నియంత పాలనలో ఉన్న సౌదీ అరేబియాతోనూ అమెరికా అచ్చికబుచ్చికలాడుతుంది. కాబట్టి అమెరికా ఈ సందర్భంగా ఇరాన్ దేశ ప్రజల ఆకాంక్షలను గమనించి వారిని ఉద్ధరించడానికి ఇదంతా చేస్తున్నదని అనుకోవడానికి ఏమీ లేదు. ఇదో సాకు మాత్రమే. ఇక ఇరాన్ చేతిలో న్యూక్లియర్ బాంబు ఉందన్నది మరో కారణం. ప్రపంచంలో న్యూక్లియర్ బాంబులు అమెరికా, ఇజ్రాయెల్ వద్ద మాత్రమే ఉండాలి, ఇంక వేరే ఏ దేశం దగ్గర ఉండొద్దు అనేది ఏ రకమైన న్యాయ సూత్రమో తెలీదు. ఇలాంటి ప్రశ్నలను ఐక్యరాజ్యసమితి లాంటి అంతర్జాతీయ సంస్థలు ఏవీ అడగవు. అణ్వాయుధాలే ఆందోళన అయితే రష్యా, నార్త్ కొరియా, ఇండియాలపై కూడా దాడి చేయాలిగా! అమెరికా, ఇజ్రాయెల్‌లు ఈ యుద్ధాన్ని ప్రపంచ ఉద్ధరణ కోసం చేస్తున్నట్టు చెప్పుకోవడంలో ఆత్మవంచన ఏమీ లేదు, కేవలం పరవంచన మాత్రమే ఉంది. ఇంతవరకు నియంతలు అన్న ఆరోపణతో అమెరికా ఆయా దేశ నాయకులను చంపేసిన తర్వాత అక్కడ ఎక్కడా స్థిరత్వం ఉన్న ప్రభుత్వం రాలేదు. కుక్కను చంపే ముందు దానిపై పిచ్చిది అన్న ముద్ర వేయాలనే సూత్రాన్ని అమెరికా నిర్మోహమాటంగా పాటిస్తుంది. ఈ ప్రపంచ రాజకీయాలలో ఒకరికి ఒకరు మిత్రులే! ఒకరికి ఒకరు శత్రువులే! ప్రజలు ఈ సామ్రాజ్యవాద, మత విస్తరణవాద రాజకీయాలను తమకు అనుకూలంగా మలచుకొని అడుగు ముందుకేస్తూ వెళ్ళాలి. అంబేడ్కర్ ఈ దేశంలో దళిత రాజకీయాలు పరిచయం చేసినప్పుడు, ఇవి ఒక రాజకీయ చర్చ అని కూడా గమనించని ఈ దేశ నాయకుల మీదా, పార్టీల మీదా నమ్మకం పెట్టుకోకుండా బ్రిటిష్ వాళ్ళ దగ్గర తన ఎజెండాను చర్చకు పెట్టాకనే దళితులకు గాంధీ ఆలయ ప్రవేశం లాంటి రాజకీయ కార్యక్రమాలకు తావునిచ్చాడు.

# పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండి

**- 20 వేలు మట్టి పాత్రలు ఏర్పాటుకు కృషి చేస్తున్నాం - వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి - ప్రభుత్వం స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలి - గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం విశాఖపట్నం జిల్లా ఎంవిపి కాలనీ లోని ఆళ్వార్ దాస్ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ అధ్యక్షతన పశుపక్ష్యాదులకు నీరు మట్టి పాత్రలలో ఏర్పాటు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పసుపక్ష్యాదులకు నీరు ఏర్పాటు చేయడానికి 20 వేలు మట్టి పాత్రలు ఏర్పాటునకు కృషి చేస్తున్నాం అన్నారు.
దేశంలో ప్రతి ఒక్కరూ స్పందించి పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. సమస్త జీవరాశిని కాపాడుకుందామన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలని కోరారు. విశాఖపట్నం జిల్లా అధికారులు కూడా స్పందించి పశుపక్ష్యా దులకు నీటి వసతి కల్పించాలని కోరారు. పక్షులు కోసం చిరుధాన్యాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అడవుల్లో, కొండల మీద, తీర ప్రాంతాలలో వర్షాకాలంలో చిరుధాన్యాలు చల్లి పశు పక్ష్యాదులకు ఆహారం అందుబాటులోకి తీసుకు రావా లని కోరారు. వేసవి కాలంలో నీటి కోసం అడవి నుండి బయ టకు వచ్చే వన్యప్రాణుల వేటగాళ్ల బారిన పడకుండా, వేట జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మ్యాంగో మేన్ అప్పాజీ, స్వాంతన సేవా సంస్థ ప్రతినిధి ప్రజ్ఞాన్ కుమార్, గ్రీన్ క్లైమేట్ టీం వాలంటీర్ జె రాజేశ్వరి, పలువురు లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.

# శ్రీ గోపాలకృష్ణ దేవాలయం 20వ వార్షికోత్సవంలో కార్పొరేటర్ ముమ్మన



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 95వ వార్డు చింతలఅగ్రహారం కొలనీలో కొలువైయున్న శ్రీ గోపాలకృష్ణ దేవాలయం 20వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా స్థానిక జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని,ఆలయ ప్రాంగణంలో మహా కుంభాభిషేకం, శ్రీకృష్ణ స్వామి వారికి విశేష తులసి పూజలు కార్పొరేటర్ ముమ్మన చేశారు. అనంతరం ఆయన శాంతి కళ్యాణంలో పాల్గొని తిలకించారు. అనంతరం కమిటీ సభ్యులు 5000 మందికి ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ లు ఆళ్ళ తాతారావు, పులమర శెట్టి అప్పారావు, సర్పంచ్ దాడి గోపి వెంకట లక్ష్మి, దాడి అప్పలనాయుడు, మద్దాల శ్రీనివాసరావు, పులమరశెట్టి లక్ష్మణ్, బొడ్డేటి జగదీష్, కర్రి శివ మరియు బిజెపి 95, 97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కెవి.సంతోష్ యాదవ్, నరవ సతీష్, సాయి, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన సనపల రవీంద్ర భరత్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఇటీవల వివాహం జరిగిన మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ వారి రెండో కుమారుడు వాసుపల్లి సాకేత్, శ్రావణిలకు వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన జగనన్నను విశాఖపట్నంలో గల వాసుపల్లి నివాసంలో వాసుపల్లి ఆద్వర్యంలో కలవడం జరిగింది. ఈ సందర్భంగా వాసుపల్లి జగన్మోహన్ రెడ్డికి సనపలను పరిచయం చేయగా బీసీల సంక్షేమం గురించి మరింత ముందుకు వెళ్ళాలని సనపల రవీంద్ర భరత్‌ను జగన్ సూచించారు.




# వాసుపల్లి ఇంటికి జగన్

**- ఘన స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే గణేశ్ కుమార్ - నూతన వధూవరులు సాకేత్, శ్రావణి దంపతులకు ఆశీర్వాదాలు - దక్షిణ నేతలతో మాటామంతి - భవిష్యత్తు వైసిపిదేనన్న జగన్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర పర్యట నలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విశాఖ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటిని సందర్శించారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో మాజీ ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. మహిళలు హారతులిచ్చి పూలాభిషేకం చేశారు. జై జగన్ సీఎం అంటూ వాసుపల్లి నివాసం వద్ద అశేష జనవాహిని కి జగన్మోహన్ రెడ్డి అభివాదాలు తెలిపారు. ముందుగా ఇటీవల వివాహం చేసుకున్న వాసుపల్లి రెండో కుమారుడు సాకేత్, శ్రావణి లను ఆయన ఆశీర్వదించారు. వాసుపల్లి కుటుంబ సభ్యులతో ఫోటో దిగారు. అనంతరం వైసీపీ నేతలతో ఆయన మాట మంతి తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై స్పందించి, ప్రజల తరపున పోరాటం చేయాలని పేర్కొన్నారు. చివరగా మనం ప్రజల మంచి కోసమే పోరాటం చేయాలని అన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ పడవద్దు అని చెప్పారు. అలాగే పార్టీ బలోపేతానికి కూడా క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించాలన్నారు. కార్యకర్తలు అందరిని కలుపుకొని వెళ్లాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నియంతత్వ పోకడలకు శ్రీకారం చుట్టిందని, పార్టీ నేతలపై కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ, బెదిరింపులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. ఎవరు అధైర్య పడవద్దు అని చెప్పారు. భవిష్యత్తు వైసిపిదే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ కన్నబాబు, అనకాపల్లి మాజీ ఎంపీ సత్యవతి, మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీ కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యేలు ధర్మాన ప్రసాదరెడ్డి, గొల్ల బాబురావు, తైనాల విజయ్ కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వైయస్సార్సీపీ నేతలు పేడాడ రమణకుమారి, ఆల్ఫా కృష్ణ, కార్పొరేటర్లు, దక్షిణ వార్డు అధ్యక్షులు సీనియర్ నాయకులు అనుబంధ సంఘాల అధ్యక్షులు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వైభవంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు




**కావలి, (రాజధాని వార్తలు):** బోగోలు మండలం కొండ బిట్రగుంట పుణ్యక్షేత్రంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. సుమారు 850 ఏళ్ల చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ పవిత్ర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం నూతనంగా నిర్మిం చిన కళ్యాణ మండపంలో కన్నుల పండుగగా నిర్వహించబడింది. వేదమంత్రాల నాదం, మంగళవాయిద్యాల మధ్య స్వామివారి దివ్య కళ్యాణం ఘనంగా జరిగింది. ఆలయ చైర్మన్ శ్రీరామ మాల్యాద్రి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో కళ్యాణ వేడుకలను వీక్షించి తరించారు. ఆలయ ప్రాంగణం భక్తు లతో కిటకిటలాడింది. నూతన కళ్యాణ మండపం నిర్మాణంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని అధికా రులు తెలిపారు. క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిని, ఆలయ అధికారులను భక్తులు అభినందించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా రానున్న రోజుల్లో మరిన్ని ప్రత్యేక పూజలు, వాహన సేవలు నిర్వహించేందుకు ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించింది.

# ఐతపూడిలో "పల్లె నిద్ర"



**కాజులూరు, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఎన్ డి పి ఓ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో గొల్లపాలెం ఎస్ఐ ఎమ్ మోహన్ కుమార్ ఐతవూడి గ్రామంలో "పల్లె నిద్ర" కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపాలెం ఎస్ఐ మోహన్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామం లోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు, జులా యిల కదలికల గురించి ప్రజలను అడిగి తెలుసు కున్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నూతన చట్టాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రతా నియమాలు, సామాజిక మాధ్యమాల విని యోగం, డ్రగ్స్ నిర్మూలన వంటి కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమా జంలో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని కోరారు. గ్రామంలో ఎక్కడెక్కడ సిసిటివి కెమెరాలు అవసరమో ప్రజలు తమవంతు సహకా రంగా ముందుకి వచ్చి, అన్ని గుళ్ళు, విగ్రహాల వద్ద లైట్లు, కెమెరాలు బిగించుటకు సహకరించాలని కోరారు. వీటివల్ల నేరం జరగకుండా అడ్డుకోవచ్చని చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడినా, సామాజిక మాధ్యమాలలో ఇతరులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం ఎస్ ఐ ఎమ్ మోహన్ కుమార్, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ స్తుల సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ హామీ ఇచ్చారు.

## మహిళలకు భద్రతకల్పించడమే మహిళా దినోత్సవ ఉద్దేశ్యం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహిళల భద్రతే అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రధాన లక్ష్యమని సిడిపిఓ జి ఉష అన్నారు. అంతర్జా తీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సిడిపిఓ ఉష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మిషన్ ఓరియంటేషన్, ప్రణాళిక సమావేశం, సైబర్ క్రైమ్ భద్రత అవగాహన, ఆర్థిక సాక్షారత మరియు రుణ ప్రచార కార్యక్రమం కోసం మహిళలకు అవగాహన కల్పించారు. దానిలో భాగంగా ట్రాకింగ్, బాల్యవివాహాలు మరియు టీనేజ్ ప్రెగ్నెన్సీ, కోసం సిడిపివో వివరించారు. ఈ కార్యక్రమం ఏపివో సి హెచ్ జగదీశ్వరి, ఆధ్వర్యంలో నిర్వహించగా ఐసీడిఎస్ సూపర్వైజర్ ఎండి సుల్తాన్ బీబీ, కె రమేష్, సీసీ ఎన్ చిన్నబ్బు, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సిసి బి.లక్ష్మి, అంగనవాడి వర్కర్ కె అనిత, వివోఎ పాల్గొన్నారు.

# టాలీవుడ్ బ్యాచిలర్స్.. ఇన్స్పిరేషన్ గా తీసుకుంటారా?



టాలీవుడ్‌లో పెళ్లి సందడి మొదలైంది. ఒకరి తర్వాత ఒకరు యంగ్ హీరోలు వివాహ బంధంలోకి అడుగు పెడుతుండటంతో ఇండస్ట్రీలోనూ, అభిమానుల్లోనూ పండుగ వాతావరణం నెలకొంది. ఇటీవల సెలబ్రిటీల పెళ్లిళ్లు వరుసగా జరుగుతుండటంతో సోషల్ మీడియాలో వెడ్డింగ్ వైబ్స్ క్లియర్‌గా కనిపిస్తున్నాయి. అదే సమయంలో హీరోల పెళ్లిళ్లకు సంబంధించిన ఈవెంట్స్ కోసం అంతా మాట్లాడుకుంటున్నారు. యంగ్ హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నారు. ఇప్పటికే ఆయన కుటుంబంలో పెళ్లి వేడుకల హడావిడి మొదలైంది. ప్రీ వెడ్డింగ్ ఈవెంట్స్ ఘనంగా నిర్వహించారు. సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయంగా జరిగిన వేడుకలు ఎంతో ఆకట్టుకున్నాయి. డెకరేషన్ నుంచి ఆతిథ్యం వరకు ప్రతి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫోటోలు, వీడియోలు బయటకు రాగానే అభిమానులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. మరోవైపు, స్టార్ జంటగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ వేడుకలు ఇటీవల జరగ్గా.. సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. రాజస్థాన్‌లో జరిగిన వారి సంగీత్, పెళ్లి వేడుకలు రాయల్ టచ్‌తో సాగాయి. రాజసంగా చేసిన అలంకరణ, ట్రెడిషనల్ డ్రెస్సింగ్, ఫ్యామిలీ ఎమోషన్స్ అన్నీ కలిపి ఆ వేడుకలను మరింత ప్రత్యేకంగా నిలిపాయి. అనంతరం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. త్వరలో గ్రాండ్ రిసెప్షన్ కూడా ప్లాన్ చేస్తున్నారు. ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన పిక్స్, వీడియోలు కూడా నెట్టింట తెగ ట్రెండ్ అయ్యాయి. ఇలా వరుసగా హీరోల పెళ్లిళ్లు జరగడం టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్‌గా మారుతోంది. ఒక్కో హీరో తన పెళ్లిని ప్రత్యేకంగా, కుటుంబ సంప్రదాయాలకు అనుగుణంగా ప్లాన్ చేసుకుంటుండడం విశేషం. అభిమానులు కూడా తమ ఫేవరెట్ హీరోల పెళ్లిళ్లను కుటుంబ వేడుకలా భావిస్తూ ఆసక్తిగా ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం అల్లు శిరీష్ పెళ్లి ఎక్కడ? ఎలా? ఎలాంటి థీమ్‌తో అనే విషయాలు ఇండస్ట్రీలో చర్చకు వస్తున్నాయి. ఇప్పటికే జరిగిన ప్రీ వెడ్డింగ్ ఈవెంట్స్ చూసిన తర్వాత మెయిన్ వెడ్డింగ్ ఇంకా గ్రాండ్‌గా ఉండబోతుందనే అంచనాలు పెరిగాయి. సింపుల్‌గా అయినా.. క్లాసీగా చేసే స్టైల్ లో శిరీష్ ప్లాన్ చేస్తున్నారట. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యేలా ప్రైవేట్ వేడుకగా నిర్వహించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ఇంకా పెళ్లి కాని టాలీవుడ్ బ్యాచిలర్ హీరోలు ఎవరెవరు? వారు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? ఎలా ప్లాన్ చేస్తారు? అన్నది అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా జరిగిన శిరీష్, విజయ్ వేడుకలను చూసి మిగతా హీరోలు కూడా ఇన్స్పిరేషన్ తీసుకుంటారా అన్నది చూడాలి. మొత్తానికి టాలీవుడ్‌లో ఇప్పుడు సినిమా హడావుడితో పాటు పెళ్లి సందడి కూడా ఈక్వల్‌గా కొనసాగుతోంది. హీరోల జీవితాల్లో కొత్త చాప్టర్ ప్రారంభమవుతుండటంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి.

# విష్ణు కొత్త మూవీ.. నాని బిగ్ బూస్ట్






టాలీవుడ్‌లో విభిన్న కాన్సెప్టులతో ప్రేక్షకులను అలరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో శ్రీవిష్ణు మరోసారి సరికొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ మృత్యుంజయ్ విడుదలకు ముందే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా నేచురల్ స్టార్ నాని చేసిన ప్రత్యేక ప్రశంసలు సినిమాపై మరింత ఆసక్తి పెంచాయి. సినిమా ప్రీ వ్యూ చూసిన నాని సోషల్ మీడియా రెస్పాండ్ అయ్యారు. "మృత్యుంజయ్ మూవీని మొదటి నుంచి చివరి వరకు చూస్తూ ఉండిపోయాను. శ్రీ విష్ణు కామెడీ టైమింగ్ తో ఫన్ రోల్స్ లో ఎంత బాగా నటిస్తారో అందరికీ తెలిసిందే. కానీ ఈ సినిమా మాత్రం సర్ప్రైజ్. చాలా బాగా చేశారు. తొలి నిర్మాణంతో కొత్తదనాన్ని ఎంచుకున్న నిర్మాత సందీప్ గుణ్ణంకు అభినందనలు. టీమ్‌కు ఆల్ ది బెస్ట్" అంటూ పోస్ట్ చేశారు. ప్రస్తుతం నేచురల్ స్టార్ పోస్ట్.. ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారి అందరినీ ఆకట్టుకుంటోంది. నాని వంటి స్టార్ హీరో నుంచి వచ్చిన ప్రశంసలు చిత్ర బృందానికి పెద్ద బూస్ట్ ఇచ్చినట్లేనని అనేక మంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. నాని పోస్ట్ చూస్తుంటే.. సినిమా కచ్చితంగా హిట్ అవుతుందని అనిపిస్తుందని పలువురు సినీ ప్రియులు చెబుతున్నారు. ఇక మూవీ విషయానికొస్తే.. మృత్యుంజయ్ సినిమాను దర్శకుడు హుస్సేన్ షా కిరణ్ తెరకెక్కిస్తుండగా, లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ఇన్వెస్టిగేషన్ బ్యాక్ డ్రాప్, ఎమోషనల్ టచ్.. అన్నీ కలిపి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే సామజవరగమన సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న శ్రీ విష్ణు– రెబా మోనికా జాన్ జంట మరోసారి మృత్యుంజయ్‌లో కలిసి నటిస్తోంది. ఆ హిట్ పెయిర్ మళ్లీ స్క్రీన్‌పై కనిపించనుండటంతో ఫ్యాన్స్‌లో అంచనాలు మరింత పెరిగాయి.

కామెడీ హీరోగా క్రేజ్ సంపాదించుకున్న శ్రీ విష్ణు ఈసారి సీరియస్, ఇంటెన్స్ పాత్రలో కనిపించడం విశేషం. అదే సమయంలో రీసెంట్‌గా విడుదలైన ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆ ట్రైలర్‌ను యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ రిలీజ్ చేశారు. సందీప్ తో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, ఆయన తండ్రి గుణ్ణం గంగరాజు లాగానే యూనిక్ కథలను ఎంపిక చేసుకుంటారని ప్రశంసిం చారు. ట్రైలర్‌లో కనిపించిన సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ సీన్స్ క్యూరియాసిటీ పెంచాయి. మొత్తానికి స్టార్ హీరోల సపోర్ట్, ఇంట్రెస్టింగ్ స్టోరీ, ఆకట్టుకున్న ట్రైలర్.. అన్నీ కలిసి మృత్యుంజయ్‌పై అందరిలో అంచనాలు పెంచాయి. మరి ఇంకొన్ని గంటల్లో రిలీజ్ కానున్న మృత్యుంజయ్ ఎలాంటి హిట్ అందుకుంటుందో వేచి చూడాలి. 7

# సంక్రాంతి బరిలో బాబాయి- అబ్బాయి క్లాష్?





సంక్రాంతి సీజన్ అంటే టాలీవుడ్‌లో భారీ సినిమాల పోటీకి వేదికనే చెప్పాలి. ప్రతి ఏడాది లాగే 2027 సంక్రాంతి కూడా ఆసక్తికరమైన బాక్సాఫీస్ పోరుకు సాక్ష్యమివ్వబోతుందనే చర్చ ఇప్పటి నుంచే మొదలైంది. ముఖ్యంగా నందమూరి అభిమానుల మధ్య ఒక ఇంట్రెస్టింగ్ క్లాష్ జరిగే అవకాశం ఉందన్న వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ హీరోగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ సినిమా సంక్రాంతి 2027 సంక్రాంతి టార్గెట్‌గా రూపొందుతున్నట్లు సమాచారం. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన వీర సింహారెడ్డి కూడా సంక్రాంతికి వచ్చి మంచి విజయాన్ని అందుకోవడంతో, ఈ కొత్త ప్రాజెక్టుపై అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను కూడా గోపీచంద్ మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ దగ్గుబాటి, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న సినిమా కూడా సంక్రాంతి 2027 బరిలోకి రావడానికి రెడీ అవుతుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు ప్రత్యేక గుర్తింపు పొందిన అనిల్ రావిపూడి ఈ సినిమాను కూడా ఎంటర్టైన్మెంట్ ప్రధానంగానే తెరకెక్కిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు సినిమాలూ నిజంగా సంక్రాంతి సీజన్‌లోనే రిలీజైతే నందమూరి అభిమానుల మధ్య ఒక ఆసక్తికర పరిస్థితి ఏర్పడే అవకాశముంది. ఒకవైపు బాలకృష్ణ సినిమా ఉండగా, మరోవైపు అదే నందమూరి కుటుంబానికి చెందిన కళ్యాణ్ రామ్ సినిమా రిలీజవడం వల్ల బాక్సాఫీస్ వద్ద ప్రత్యేకమైన పోటీ కనిపించవచ్చు. ఇలాంటి సిట్యుయేషన్‌లో జూ. ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించే అవకాశం లేకపోలేదు. మామూలుగా తన అన్న కళ్యాణ్ రామ్ నుంచి వచ్చే సినిమాల ప్రమోషన్స్‌లో ఎన్టీఆర్ పాల్గొని ఆ సినిమాను ప్రమోట్ చేస్తుంటారనే విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఇప్పటికే పలు సినిమాల ఆడియో లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్లకు తారక్ వచ్చి కళ్యాణ్ రామ్‌కు తన సపోర్ట్ అందించారు. రాబోయే సినిమాకు కూడా ఎన్టీఆర్ చీఫ్ గెస్టుగా హాజరైతే ఈ సినిమా బజ్ నెక్స్ట్ లెవెల్‌కు వెళ్లడం ఖాయం. అసలే మల్టీస్టారర్ బజ్, అనిల్ క్రేజ్‌తో పాటూ ఎన్టీఆర్ గెస్ట్‌గా కూడా రావడం జరిగితే ఈ సినిమాకు హైప్ భారీగా వస్తుంది. ఒకవేళ ఎన్టీఆర్ ఎలాంటి ప్రమోషన్స్‌లో పాల్గొనకపోయినా, కళ్యాణ్ రామ్ సినిమాకు తారక్ ఫ్యాన్స్ నుంచి ఫుల్ సపోర్ట్ దక్కే అవకాశముంది. ఈ నేపథ్యంలో నందమూరి ఫ్యాన్స్ రెండు వర్గాలుగా విడిపోయే పరిస్థితి ఏర్పడుతుందా అనే ప్రశ్న కూడా మొదలైంది. అయితే సంక్రాంతి టైమ్‌లో పెద్ద సినిమాల మధ్య పోటీ కొత్త విషయమేమీ కాదు, గతంలో కూడా పలుమార్లు భారీ సినిమాలు ఒకేసారి రిలీజై బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అయిన సందర్భాలున్నాయి.

కానీ ఒకే ఫ్యామిలీ నుంచి ఇద్దరు హీరోలు సంక్రాంతి బరిలో నిలుస్తారనే వార్త అందరినీ ఎగ్జైట్ చేస్తోంది. ఒకవేళ అదే జరిగితే నందమూరి ఫ్యాన్స్‌కు ఇదొక స్పెషల్ బాక్సాఫీస్ సీజన్‌గా మారే అవకాశముంది.

# పెళ్ళి ప్రయత్నాల్లో పూజాహెగ్డే తల్లితండ్రులు!



బుట్టబొమ్మ పూజాహెగ్డే వృత్తిగత జీవితం గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ నుంచి సౌత్‌కి మళ్లీ కంబ్యాక్ అయిన తర్వాత ఒక్కొక్కటిగా అవకాశాలు అందుకుంటుంది. టాలీవుడ్ పక్కన బెట్టినా కోలీవుడ్ మాత్రం అక్కున చేర్చుకుని ఆదరిస్తుంది. ఈ క్రమంలోనే పూజాహెగ్డే పేరు మీడియాలో వైరల్ అవుతుంది. లేదంటే అమ్మడు పేరు కనుమరుగైపోయేది. కోలీవుడ్ అవకాశాలతో మెల్లగా మళ్లీ టాలీవుడ్‌లోనూ బిజీ అవ్వాలని చేయని ప్రయత్నం లేదు. పాత పరిచయాలతో మళ్లీ అవకాశాలు అందుకునే చర్యలు చేపట్టింది. ఇదంతా ప్రొఫెషనల్ లైఫ్. మరి అమ్మడి వ్యక్తిగత జీవితం ఎలా ఉంది? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. పూజా హెగ్డేకి తల్లిదండ్రులు పెళ్లి కొడుకుని వెతికే పనిలో పడ్డట్లు తెలుస్తోంది. అమ్మడి వయసు ఇప్పటికే 35 ఏళ్లు నిండటంతో పెళ్లి చేసుకోమని ఇంట్లో తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారుట. కొన్ని నెలలలుగా ఈ ఒత్తిడి మొదలైన నేపథ్యంలో తాజాగా పెళ్లి విషయంలో సంబంధాలు చూడండని చెప్పిందిట. డాడ్ మంజునాథ్ హెగ్డే..మామ్ లతా హెగ్డే ఓ పెద్ద వ్యాపారవేత్త కుటుంబం నుండి సంబంధాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ముంబైకి చెందిన బిజినెస్‌మెన్‌తో ఆమె పెళ్లి ఉండవచ్చని వార్తలొస్తున్నాయి. మరి ఈ ప్రచారంలో నిజానిజాలు తేలాల్సి ఉంది. పూజాహెగ్డే మనసులో ఎవరైనా ఉన్నారా? లవ్..రిలేషన్‌షిప్ అంటూ కొందరి పేర్లు గతంలోనే తెరపైకి వచ్చాయి. దివంగత నటుడు నవినోద్ మెహ్రా కుమారుడు, నటుడు రోహన్ మెహ్రా సన్నిహితంగా ఉంటుందనే ప్రచారం జరిగింది. వీరిద్దరూ పలుమార్లు ముంబైలో కెమెరా కంటికి చిక్కారు. 2024 ఏప్రిల్‌లో పూజా తల్లిదండ్రులతో కలిసి రోహన్ లంచ్‌కు వెళ్లడం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. అటుపై 'కిసీకా భాయ్ కిసీకా జాన్' షూటింగ్ సమయంలో సల్మాన్ ఖాన్‌తోనూ ప్రేమలో ఉందనే ప్రచారం జరిగింది. పూజాహెగ్డే సోదరుడు రిషబ్ హెగ్డే పెళ్లికి సల్మాన్ అటెండ్ అవ్వడం అప్పట్లో చర్చనీయాంశం అయింది. అలాగే కర్ణాటకకు చెందిన ఓ క్రికెటర్‌ను పెళ్లాడుతుందనే కథనాలు వైరల్ అయ్యాయి. చివరిగా బాలీవుడ్ యువ నటుడు ఇషాన్ కట్టర్‌తోనూ అమ్మడు సన్నిహితంగా దిగిన ఫోటోలు ఎన్నో సందేహాలకు తావిచ్చాయి. ఇద్దరు కలిసి ట్రిప్పులకు వెళ్లడం, సరదాగా గడపడం వంటివి చూసి సంథింగ్ సంథింగ్ నడుస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాలపై పూజాహెగ్డే ఏనాడు స్పందించకపోవడంతో ఇవన్నీ కల్పిత కథనాలగా బాలీవుడ్ మీడియా తుదిగా పేర్కొంది. ప్రస్తుతం పూజాహెగ్డే తమిళ, హిందీలో కలిపి నాలుగు సినిమాల్లో నటిస్తోంది. వీటిలో దుల్కార్ సల్మాన్ హీరోగా ఓ తెలుగు సినిమా చేస్తున్నాడు. అందులో హీరోయిన్‌గా పూజాహెగ్డే ఎంపికవ్వడం విశేషం.

# ఏపీలో జర్నలిస్టులను విస్మరించము...నిర్లక్ష్యం చేయం

## - సమస్యలు పరిష్కారానికి ముందుంటా - దశలవారీగా పరిష్కారం చూపిస్తా - జర్నలిస్టుల సంక్షేమ నిధికి 5 లక్షలు విరాళం : రాష్ట్ర సమాచార పౌరసరఫరాల మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ, (రాజధాని వార్తలు):** జర్నలిస్టుల పట్ల తమ ప్రభుత్వానికి సానుకూలతే ఉందని వివిధ సందర్భాల్లో జిల్లాల్లో జర్నలిస్టు సంఘాల నాయకులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను చర్చిస్తుంటామని.. ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తుంటామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కే పార్థసారథి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీ డబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన "చలో విజయవాడ" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచీ చాలా పెద్ద సంఖ్యలో హాజరైన జర్నలిస్టులు మహాత్మాగాంధీ రోడ్డు రాఘవయ్య పార్క్ సెంటర్ నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ జరిగింది. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో "ఫెడరేషన్" రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు అధ్యక్షతన సభ జరిగింది. రాష్ట్ర నాయకులు తెలిపిన ఆయా సమస్యలపై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి యధాశక్తి కృషి చేస్తానని పేర్కొన్నారు. జర్నలిస్టుల ముఖ్య సమస్యలన్నింటినీ సీఎంతో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. "జర్నలిస్టులను విస్మరించం నిర్లక్ష్యం చేయం" అని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకంలో అంతరం లేకుండా నిరవధికంగా కొనసాగేలా చూస్తానన్నారు. ఏడాదికి రెండుసార్లైనా జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలన్న విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ ఐఎంఏ, పెద్ద ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించి జర్నలిస్టులకు లబ్ధి కలిగేలా చూస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధిని పెంచి ఫలాలు అందేలా కార్యాచరణ ఆలోచిస్తామని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఈ పథకానికి తాను వ్యక్తిగతంగా ఐదు లక్షల రూపాయలు అందజేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు ఇంటి స్థలాల అభ్యర్థనను ప్రస్తావిస్తూ ఈ వరకే ఉన్న పథకంలో జర్నలిస్టుల్ని కలిపే విషయం సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. జర్నలిస్టులపై దాడుల్ని ఖండించి తీరతామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థల్లో ఉచితంగా అసెంబ్లీలో ప్రతిపక్షం లేకున్నా మీడియాలో వస్తున్న వివిధ సమస్యలను ప్రభుత్వం చర్చిస్తుంటుందని మంత్రి తెలిపారు.




సోషల్ మీడియా, యూట్యూబ్‌లలో తరచూ ఫేక్ న్యూస్ వస్తున్నందున మిగతా జర్నలిస్టుల మీద కూడా కొంత విముఖత లేకపోలేదన్నారు. అబద్ధాల తప్పుడు వార్తల విషయంలో ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. దేశంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల కంటే ప్రజల సంక్షేమానికి ఎక్కువ మొత్తంలో కేటాయిస్తోంది ఆంధ్రప్రదేశేనని ఆయన చెప్పారు. "ఫెడరేషన్" ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ "సేవ్ జర్నలిజం ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్" అని జర్నలిస్టుల జాతీయ సంఘం పేర్కొన్న అంశాన్ని తొలుత ప్రస్తావించారు. తమ సంఘంలో 7 వేల మందికి పైగా సభ్యులున్నారంటూ వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించారు. జర్నలిజం వృత్తి పెద్ద ప్రమాదంలో పడింది. జర్నలిస్టులకున్న కొద్దిపాటి చట్టాలను కూడా కేంద్రం రద్దు చేసింది. మాకు ఏ సదుపాయాలున్నాయో తెలియదు. జర్నలిస్టుల పరిస్థితులు అన్నింటినీ అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది అని ఆంజనేయులు పేర్కొన్నారు. కొన్ని వార్తలు విషయంలో అప్పుడప్పుడు రాజకీయ నాయకులు మరికొన్ని సంఘ వ్యతిరేక శక్తుల నుండి దాడులు ఎదుర్కొన్న సందర్భాలు గతంలో ఉంటే ఇప్పుడు అధికారుల నుండే జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయి. కేసులు పెడుతున్నారు. నోటీసులు ఇస్తున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలకు రూ. 3



వేల చొప్పున మూడు సంవత్సరాల పాటు పరిహారం అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కనీసం ఒక్క వృద్ధాశ్రమాన్ని జర్నలిస్టుల కోసం కేటాయించాలని ఆంజనేయులు అభ్యర్థించారు. దేశంలో 18 రాష్ట్రాల్లో పెన్షన్ ఇస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం వెయ్యి 1200 మించి రిటైర్డ్ జర్నలిస్ట్స్ ఉండరు. నెలకు కొంత మొత్తం పెన్షన్ గా ఇస్తే అదో సామాజిక భద్రతగా ఉంటుంది. మన రాష్ట్రంలో కూడా పెన్షన్ అమలు చేయాలని కోరుతున్నామని వెంకటరావు తన అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు. చాలాకాలంగా జర్నలిస్టుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. అందరి సమస్యలూ జర్నలిస్టులు వెలికి తీస్తారు. మరి వారి సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదు అని ఆవేదన వ్యక్తంచేశారు. జర్నలిస్టుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. వాటి పరిష్కారం కోసం పలుమార్లు మంత్రికి, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. తొలుత "ఫెడరేషన్" ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.బి.నాథన్ స్వాగతం పలుకుతూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ప్రధానంగా 14 సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కలిమిశ్రీ నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. "ఫెడరేషన్", ఏపీ బీజేఏ, ఎన్ఏజే నాయకులు కొండయ్య, అమరయ్య, గంట్ల శ్రీనుబాబు, ఎం.శ్రీనివాసరావు, మంజరి, శాంతిశ్రీ, ఇంకా ఆ సంఘాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వేదికను అలంకరించారు. మంత్రికి ఆయా సమస్యలను వివరిస్తూ అ సంఘాల రాష్ట్ర నాయకులు వినతిపత్రం అందించారు. తొలుత "కళారత్న" నాట్యగురు భాగవతుల సౌమ్య శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి. సౌమ్యను మంత్రి ద్వారా సన్మానించారు. నర్తకీమణులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రజానాట్య మండలి గాయకులు అనిల్, కవి, అప్పన్న పాడిన అభ్యుదయ గీతాలు అలరించాయి.

**అద్భుత ప్రదర్శన**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నుండి పెద్ద సంఖ్యలో "ఛలో విజయవాడ" కార్యక్రమానికి విచ్చేశారు. కొన్ని జిల్లాల నుండి వేకువజామునే నగరానికి చేరుకున్నారు. బస్సులు, రైళ్లు, కార్లు తదితర మార్గాల ద్వారా ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 11 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు ప్రకటించినా పది గంటలకే చేరుకోనారంభించారు. 11:30 గంటల వరకు ఆయా జిల్లాల నుండి జర్నలిస్టులు వస్తూనే ఉన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి. పెన్షన్ సదుపాయం కల్పించాలి. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి జర్నలిస్టులకు వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి తదితర నినాదాలతో మహాత్మా గాంధీ రోడ్డు మారుమోగింది.

పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన ప్పటికీ రద్దీని అదుపుచేయడానికి ట్రాఫిక్ ను క్లియర్ చేయడానికి అనివార్యంగా రోప్ పార్టీని ఏర్పాటు చేయాల్సొచ్చింది. ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ర్యాలీ చేయడం ఇటీవల కాలంలో ఇదే పేర్కొనదగినది. ర్యాలీకి సిఐటియు రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి తదితరులు మద్దతు పలికారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులతోపాటు ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గాలు ఇతర సభ్యులు మహిళలు సహా పెద్ద సంఖ్యలో పాల్గొనడం నగర ప్రజానీకాన్ని అబ్బురపరిచింది.

# క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం



**ఒంగోలు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అత్యధికంగా క్రీడా రంగంలో పాల్గొనేలా యువతను ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. దర్శి పట్టణం లోని శివరాజనగర్ లో నూతనంగా నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియంను బుధవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, దర్శి నియోజక వర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మితో కలసి సందర్శించి చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దర్శి పట్టణంలో ఇలాంటి క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయడం చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న విషయమన్నారు. మనస్సు పెట్టి వినూత్నంగా ఆలోచిస్తే సాధించలేనిది ఏమి లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎప్పుడు చెపుతూ ఉంటారని, దానికి మంచి ఉదాహరణ, ఈ క్రికెట్ స్టేడియం నిర్మాణం అని అన్నారు. ఈ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి రెవెన్యూ శాఖ పరంగా కృషి చేసిన తహసిల్దార్‌ను, క్రికెట్ స్టేడియంలో అవసరమైన నీటి వసతి, లైటింగ్ ఏర్పాటు, గ్రాస్ ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలైన కల్పనకు కృషి చేసిన దర్శి నియోజక వర్గ టిడిపి ఇంచార్జి లక్ష్మి గార్లను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. నేడు చిన్న పిల్లల నుండి పెద్ద వారి వరకు ఆస్వాదించే గేమ్ క్రికెట్ అని, దర్శి పట్టణంలో క్రికెట్ స్టేడియంను ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. రానున్న రోజుల్లో ఈ క్రికెట్ స్టేడియం అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందే అవకాసం ఉన్నందున. ఈ స్టేడియంను మరింతగా అభివృద్ధి చేయడానికి జిల్లా యంత్రాంగం తరపున తమ వంతు సహకారం అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. యువత కూడా ఈ స్టేడియంను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మరింతగా రాణించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యువతకు సూచించారు. దర్శి నియోజక వర్గ టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ, ఈ దర్శి పట్టణంలో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువత ఎంతోమంది ఉన్నారని, కానీ సదుపాయాలు, అవకాశాలు లేక ఈ ప్రాంత యువత ఇతర ప్రాంతాలకు వెళ్ళడం గమనించి ఈ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం జరిగిందన్నారు. స్పోర్ట్స్ వలన ఆరోగ్య పరంగా ఉపయోగాలతో పాటు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ సదుపాయం కూడా ఉంటుందని, ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, అద్దంకి రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్సన్, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తీరాన్ని కొల్లగొడుతున్నా పట్టించుకోరా

## - పర్యావరణ,మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో తీరంలోని గ్రీన్ బెల్ట్ కనుమరుగయ్యింది - సిఆర్‌జెడ్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలపై శాసన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** సముద్ర తీరం వెంబడి సి ఆర్ జెడ్ పరిధిలోని అక్రమ ఇసుక తవ్వకాలపై శాసనమండలిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో సముద్ర తీరం వెంబడి 500 మీటర్ల వరకు ఉన్న కోస్టల్ రెగ్యులేటరీ జోన్స్ (సిఆర్ జెడ్) పరిధిలో ఇటువంటి తవ్వకాలు, నిర్మాణాలు చేపట్టకూడదని కఠిన నిబంధన ఉన్న ప్పటికీ యదేచ్చగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సముద్ర తీరం వెంబడి ఉండే గ్రీన్ బెల్ట్ పరిధిలో పర్యావరణం, మైనింగ్ అనుమతులు లేకుండా ఆ భూములలో తవ్వకాలు చేపట్ట డంపై బుధవారం శాసన మండలిలో కూటమి ప్రభుత్వాన్ని ఇజ్రాయిల్ నిలదీశారు. సి ఆర్ జెడ్ పరిధి దాటి పర్యావరణ అనుమతులతో ఏదైనా నిర్మాణాలు చేపట్టవచ్చని, అలా కాకుండా ఉభయ గోదావరి జిల్లాలలో ఎటువంటి పర్యావరణ, మైనింగ్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, ఇసుకను అక్రమ తవ్వకాలు చేపట్టడం ద్వారా సముద్రం తీరం వెంబడి ఉండే గ్రీన్ బెల్ట్ పూర్తిగా తొలగిపోయి తీరం కోతకు గురవుతుందని అన్నారు. దీనికి మంచి ఉదాహరణ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ప్రాంతంలో కిలో మీటర్ వెనుక ఉండే సముద్ర తీరం ఇప్పుడు ఓ ఎన్జిసి టెర్మినల్ గోడను తాకే పరిస్థితి వచ్చిందని దీంతో వేలకోట్ల చమురు, సహజ వాయువును ఉత్పత్తి చేసే ఓ ఎన్ జి సి టెర్మినల్‌కు పెనుముప్పు ఏర్పడిందని వివరించారు. తీరం వెంబడి గ్రీన్ బెల్ట్ లేకపోవడంతో కోనసీమ ప్రాంతంలో సముద్రం ముందుకు చర్చుకొని వచ్చి కాలువలు, డ్రైన్లు ద్వారా సముద్రపు ఉప్పు నీరు పొలాల్లోకి ప్రవేశించి ధాన్యపు రాశులను పండించే పంట పొలాలు చౌడు భూము లుగా మారిపోవడంతో పాటు అక్కడ ఉన్న వేలాది ఎకరాల కొబ్బరి తోటలు నాశనమయ్యాయని సభ దృష్టికి తీసుకు వచ్చారు. పర్యావరణ, మైనింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అధికారులు రాజకీయ నాయకులు కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపిస్తున్నారని సభలో అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సముద్ర తీరానికి రక్షణ కవచంగా ఉండే గ్రీన్ బెల్ట్‌ను పునరుద్ధించాలని అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలని, పర్యావరణాన్ని, సముద్ర తీరాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి : డిపిఓ లక్ష్మణరావు

## - కరప గ్రామ పంచాయతీని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి





**కరప, (రాజధాని వార్తలు):** కరప గ్రామ పంచాయతీలో పన్నుల వసూళ్లలో వేగం పెంచడంతో పాటు ఆన్‌లైన్ చెల్లింపులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఇంచార్జ్ డిపిఓ వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు సూచించారు. బుధవారం కరప మం డలం స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించి, గ్రామంలో పన్నుల వసూళ్ల ప్రగతిని పరిశీలించారు. లక్ష్యాలకు అనుగుణంగా 100 శాతం వసూళ్లు జరగాలని, పెండింగ్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించే విధానం గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని, డిజిటల్ చెల్లిం పులు చేయడం వల్ల పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. గ్రామస్థులకు డిజిటల్ లావాదేవీలపై నమ్మకం కల్పించి, నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎంపీ హరీష్ బాలయోగి

**అల్లవరం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడితిప్ప పరిధిలోని గోపాయిలంకలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవమునకు సిద్ధంగా వున్న శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి వారిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి బుధవారం దర్శించుకున్నారు. అభయాంజనేయ స్వామి వారి ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం నిర్వహిస్తుండగా ఎంపీ హరీష్ బాలయోగి శుక్రవారం అందుబాటులో ఉండని కారణంగా మహోత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ముందస్తుగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అడపా కృష్ణ, చిట్టినీడి దానయ్య నాయుడు, పశ్చిమాల ఏడుకొండలు, ముత్యాల బాబి గ్రామస్తులు పాల్గొన్నారు.



# గుడిమల్లంలో ఈ నెల 18 నుండి 23 వరకు మహా కుంభాభిషేకం

## - ఈనెల 8 నుండి బాలాలయంలోకి గుడిమల్లం పరశురామేశ్వర స్వామి

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** భారతదేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం శ్రీ పరుశురామేశ్వర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు వైభవంగా మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నామని ఆలయం ధర్మకర్తల మండలి చైర్మన్ బత్తల గిరినాయుడు తెలిపారు. ఈక్రమంలో చిన్న మరమ్మతు పనులు చేయడానికి ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ గుడిమల్లంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. చారిత్రాత్మక పుణ్యక్షేత్రం, శ్రీ ఆనందవల్లి సమేత పరశురామేశ్వర స్వామి వారి ఆలయంలో మార్చి 8వ తేదీన స్వామివారు బాలాలయంలోకి వెళ్ళనున్నారని చైర్మన్ చెప్పారు. బాలాలయం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మేరకు బుధవారం గుడిమల్లంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయ పాలక మండలి చైర్మన్ బత్తల గిరినాయుడు, ఈఓ కె.రామచంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ, పాలక మండలి సభ్యులు వివరాలు వెల్లడించారు. కేంద్ర పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఆలయ పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, ఆగమ శాస్త్రం ప్రకారం ఈ బాలాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని చైర్మన్ గిరి నాయుడు తెలిపారు. ఎందుకు ఈ బాలాలయం..? ప్రస్తుతం ఆలయంలోని రాజగోపురంతో పాటు ఇతర కీలక ప్రాంతాలలో మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి. శాస్త్రం ప్రకారం గర్భాలయంలో పనులు జరుగుతున్నప్పుడు, మూలవిరాట్ శక్తులను తాత్కాలికంగా అత్తి చెక్కతో చేసిన ప్రతిమలోకి (నమూనా) ఆవాహన చేసి, ప్రత్యేకంగా నిర్మించిన బాలాలయంలో ప్రతిష్ఠిస్తారు. పనులు పూర్తయ్యే వరకు స్వామివారికి నిత్య పూజలు అక్కడే జరుగుతాయి. రెండు రోజుల



కార్యక్రమ వివరాలు మార్చి 7, శనివారం ఉదయం 8:30 నుండి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, నవగ్రహ దేవతల కలశ స్థాపన మరియు హోమాలు మధ్యాహ్నం 12:00 గంటలకు పూర్ణాహుతి, దీపారాధన. సాయంత్రం 4:00 నుండి వాస్తు శాంతి, అంకురార్పణ, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ మరియు యాగశాల పూజలు రాత్రి 10:00 గంటలకు మొదటి కాల పూర్ణాహుతి జరుగుతుంది. మార్చి 8, ఆదివారం ఉదయం 6:00 నుండి వల్లభ గణపతి పూజ, సూర్య పూజ, మండలారాధన, విశేష హోమాలు ఉదయం 9:15 గంటలకు యాగశాల నుండి కలశాల ఊరేగింపు (బాలాలయానికి ప్రయాణం) ఉదయం 9:45 నుండి 10:00 వరకు శ్రీ ఆనందవల్లి సమేత పరశురామేశ్వర స్వామి వారికి బాలాలయం మహాకుంభాభిషేకం ఉదయం 10:00 గంట లకు మహా దీపారాధన, భక్తులకు ప్రసాద వితరణ. ఈ కార్యక్ర మాలను ఆలయ ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులందరూ ఈ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు. దాతల సహాయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చైర్మన్ బత్తల గిరి నాయుడు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నేతృత్వంలో గుడిమల్లం ఆలయం ఎంత అభివృద్ధి చెందుతూ ఉందని ఆలయ పాలక మండలి చైర్మన్ గిరినాయుడు స్పష్టం చేశారు. గుడిమల్లం ఆలయానికి శాశ్వతమైన వనరులు ఏర్పాటు కోసం అవసరమైన స్థల సమీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. దాతలు ఆలయ అభివృద్ధికి ముందుకు వస్తున్నారని, అయితే శాశ్వత కట్టడాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులు దాతల సహాయంతో చేపట్టి తరువాత శాశ్వత కట్టడాలు, ఇతర సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మూడు కోట్ల రూపాయలతో గుడిమల్లంకు రోడ్డుతో పాటు నూతన రైల్వే స్టేషన్ నుంచి ఒకటిన్నర కిలోమీటర్ దూరం గుడిమల్లం ఆలయానికి రహదారి ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చర్యలు చేపట్టారని ఆయన తెలిపారు. అంతేకాకుండా గుడిమల్లం ఆలయంకు సంబంధించి మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. గుడిమల్లంకు వచ్చే రహదారి మహా కుంభాభిషేకం నాటికి ప్రారంభం చేయనున్నట్లు ఆయన తెలిపారు. గుడిమల్లం ఆలయంలో ఉన్న ఏ చిన్న కట్టడం ధ్వంసం కాకుండా మహా కుంభాభిషేకం చేపట్ట నున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు రాజకుమార్ నాయుడు, అరుణ, నిరంజన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆలయ అభివృద్ధి ప్రధాన ఎజెండా : ఈవో కే రామచంద్రారెడ్డి**

గుడిమల్లం ఆలయ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు చేపట్టేందుకు ప్రత్యేకమైన అజెండాతో ముందుకు వెళుతున్నట్లు ఆలయ ఈవో కే.రామచంద్ర రెడ్డి తెలిపారు. దాతల సహాయంతో స్థలాలు కొను గోలు చేసి ఆలయము అభివృద్ధి చేస్తామని తెలిపారు. మాస శివరాత్రి వంగ ఫేమస్కంతమూర్తికి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవమూర్తుల ఏర్పాటుతోపాటు ప్రత్యేక పూజలకు భక్తులకు అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గుండ్ల కండ్రిక పంచాయతీలో గుడిమల్లం ఆలయానికి 18 ఎకరాల 32 సెంట్లు భూమి ఉన్నట్లు తెలిపారు. పూలవానికుంట పేరుతో భూమి ఉందని వివరించారు. ఆ భూమి కూడా కొందరి ఆక్రమణలో ఉందని త్వరలో వాటిపై కూడా దృష్టి పెట్టి ఆలయానికి వచ్చే విధంగా ఆలయ కమిటీతో కృషి చేస్తామని చెప్పారు. అదేవిధంగా ఆలయంలో ప్రవేశపెట్టిన వస్త్ర సేవ కార్యక్రమం ద్వారా సంవత్సరానికి 60000 ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు.

**40 మంది రిత్వికులతో మహా కుంభాభిషేకం : ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ**

ఆలయ మరమ్మతు పనులు పూర్తయిన తర్వాత ఏప్రిల్ 19 నుంచి 23వ తేదీ వరకు మహా కుంభాభిషేకం 40 మంది రిత్వికులచే చెప్పటనన్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వంశీకృష్ణ శర్మ తెలిపారు. ఏప్రిల్ 19వ తేదీ పరశురామేశ్వర స్వామి జయంతి సందర్భంగా మహా కుంభాభిషేకం ప్రారంభమై 23వ తేదీ వరకు జరుగుతుందన్నారు. 42 రోజులు పాటు భక్తులకు స్వామి వారి దర్శనం బాలాలయంలోనే జరుగుతాయని ప్రధాన అర్చకులు తెలిపారు.

# బాధిత కుటుంబాలకు రైస్ మిల్లర్ల సహాయం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వేట్లపాలెం ప్రమాద ఘటనలో పలువురు మృతి చెందడం, మరికొందరు తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందడం దురదృష్టకరమైన సంఘటనని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. బుధవారం సామర్లకోట మండలం వేట్ల పాలెం, జి మేడపాడు, సామర్లకోట పట్టణ పరిధిలోని కుమ్మరి వీధి ప్రాంతాల్లో గల బాణా సంచా ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు, క్షతగాత్రుల కుటుంబాలకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో రూ. 25 వేలు, 25 కేజీల బియ్యాన్ని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయ చినరాజప్ప తనయుడు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు రంగనాగ్, కూటమి నాయకులు చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ వేట్లపాలెం ప్రమాద ఘటన దురదృష్టకరమని, ప్రమాదం జరిగిన వెంటనే పెద్దాపురం శాసనస భ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, తాను జిల్లా కలెక్టర్, ఎస్పీ దృష్టికి సమాచారం తీసుకువెళ్ళి రక్షణ చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా యంత్రాంగం కృషి చేసినప్పటికే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం, పలువురు తీవ్ర గాయాలు కావడం జరిగిందన్నారు. ప్రమాద సంఘటన తెలిసిన వెం టనే ముఖ్యమంత్రి చంద్రబాబు సామర్లకోటలో పర్యటంచి సంఘటన స్థలాన్ని బాధితులను పరామర్శించి ప్రభుత్వం తరుపున ఆదుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని సూచించారని, మృతుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్గ్రేషియా సైతం ప్రకటించడం, దానిని అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభు త్వం ప్రమాద ఘటనలో మృతి చెందిన, గాయపడిన కుటుంబాలకు అండగా ఉంటుందని, అర్హులైన వారికి ఉద్యోగం కల్పించేలా చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. అలాగే బాధితుల సహాయార్థం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ యజమానులు ముందుకు వచ్చి ఈ విధమైన సహాయ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ అసోసియేషన్ నాయకులు నున్న రామకృష్ణ, గుమ్మళ్ళ సత్యనారాయణ, సైరస్ శ్రీను, లలితా ఇండస్ట్రీ యజమాని మట్టే శ్రీనివాస్, రామా రైస్ మిల్ యజమాని కాటంరాజు, కూటమి నాయకులు బదుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, అడబాల కుమారస్వామి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, గుమ్మళ్ళ రామకృష్ణ, అందుగుల మణి కుమారి, తాతపూడి కృష్ణ బాబు, కాపవరపు కుమార్, బలుసు వాసు, తుమ్మల ప్రసాద్, ముత్యం రాజబాబు, పైణ్ణి శ్రీనివాస్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# "మాదక ద్రవ్యాల ఉద్యమ" ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఈనెల 12వ తేదీన నిర్వహించే మాధక ద్రవ్యాల ఉద్యమ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ కార్యక్రమం సామర్ల కోటలో ఘనంగా నిర్వహించారు. వైబ్రేంట్స్ ఆఫ్ కాలం ఆర్గనైజేషన్ అధినేత విజయ్ కళామ్ ఆధ్వర్యంలో డిస్టిక్ కో ఆర్డినేటర్ పొన్నల దినకర్ పర్యవేక్షణలో పెద్దాపురం నియోజకవర్గం కోఆర్డినేటర్ బొందల శ్రీనివాస్ కోఆర్డినేషన్‌తో పెద్దాపురం నియోజకవర్గం నందు నిర్వహించే "దండి మార్చి 2.0 మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమం" కార్యక్రమానికి సంబంధించి సామర్లకోట తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బదుగు శ్రీకాంత్ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శక త్వంలో దేశ యువత భవిష్యత్తుకి ప్రతిబంధకంగా మారిన మాదకద్రవ్యాల పట్ల చైతన్యం కలిగించాలని "వైబ్రంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్" ఆధ్వర్యంలో బలమైన కార్యాచరణ రూపొందించడం జరిగింద న్నారు. విద్యార్థులు, యువకులు, ప్రజలు భాగస్వామ్యంతో దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపాలనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి ప్రసాద్, గుడాల శంకర్, మడగల శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాకరన్ హత్య కేసులో ముగ్గురు అన్నదమ్ముల అరెస్ట్

## - నిందితుల నుంచి రెండు కత్తులు, బైక్ స్వాధీనం - పాత కక్షలతోనే కిరాతక హత్య నిందితులను రిమాండుకు తరలింపు



**తడ, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా తడ మండలం పెరియవట్టు గ్రామంలో గత నెల 28న సంచలనం సృష్టించిన ప్రభాకరన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను బుధవారం ఉదయం తడ పోలీసులు తడ రాఘవ కాంప్లెక్స్ పక్కన పాతబడిన హాస్టల్ భవనంలో నిందితులు దాకున్నట్లు సమాచారం అందడంతో వారిని అరెస్ట్ చేశారు.

అనంతరం డీఎస్పీ చెంచుబాబు మీడియా తో మాట్లాడుతూ, నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నాం. హత్యా పెరియవట్టు మెయిన్ రోడ్డులో టైర్ పంచర్ షాపు నడుపుకుంటున్న ప్రభాకరన్‌తో, అదే గ్రామానికి చెందిన వి. దినేష్, వి.సతీష్ అలియాస్ అప్పు, వి. విగ్నేష్ అలియాస్ విక్కీ అనే ముగ్గురు అన్నదమ్ములకు పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో గత నెల 28వ తేదీ సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో, ప్రభాకరన్‌ను అంతమొందించాలనే ఉద్దేశంతో ముగ్గురూ బైక్‌పై షాపు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ప్రభాకరన్‌పై కత్తులతో విచక్షణారహితంగా తలపై, ముఖంపై, మెడపై నరికి అతి కిరాతకంగా చంపి అక్కడి నుండి పరార య్యారు. నిందితులపై తడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 33/2026 ప్రకారం కేసు నమోదు చేసి, వారిని రిమాండ్ నిమిత్తం సూళ్ళూరుపేట కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును త్వరితగతి న దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసిన నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, సూళ్ళూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండప్ప నాయుడు మరియు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ మరియు డీఎస్పీ అభినందించారు.

# ఎస్.ఎం.ఏ బాధిత చిన్నారులకు రూ.74 వేల ఆర్థిక సహాయం

## - వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ సేవా కార్యక్రమం

**కరప, (రాజధాని వార్తలు):** అరుదైన జన్యుపరమైన ఎస్ఎంఏ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు బీనల్, మోజేష్ రాయల్‌ల వైద్య ఖర్చుల నిమిత్తం వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్, వేళంగి యువత కలిసి రూ.74 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కర్నూలు జిల్లాకు చెందిన పునర్విక అనే చిన్నారికి ఎస్ఎంఏ వ్యాధి నిర్ధారణ కావడంతో ఆమె చికిత్స కోసం సుమారు రూ.16 కోట్ల భారీ మొత్తం అవసరమైంది. ఈ నేపథ్యంలో వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ సభ్యులు 'సేవ్ పునర్విక' నినాదంతో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. గ్రామ ప్రజల సహకారంతో మొత్తం రూ.74 వేల నిధులు సమకూరాయి. ఈ నేపథ్యంలో పునర్విక కోసం సేకరించిన నిధులను ఆమె కుటుంబానికి అందిం చేందుకు సంప్రదించగా, ప్రభుత్వం స్పందించ డంతో ఫండ్ రైజింగ్ కార్యక్రమాలను నిలిపి వేయాలని పునర్విక తండ్రి సురేష్ కుమార్ కోరినట్లు తెలిపారు. ఇదే వ్యాధితో బాధపడుతున్న మరో చిన్నారికి అందించాలని సూచించారు. యూట్యూబర్ సూర్య సూచన మేరకు కాకినాడ నగరానికి చెందిన ఎస్ఎంఎస్ బాధిత చిన్నారులు బీనల్, మోజేష్ రాయల్‌లకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.74 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ



ప్రజల సహకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకాల సంజయ్, కంచి తేజ గణేష్, సంతోష్, సత్యం, జయబాబు, మంచెం వీరబాబు, షేక్ లాలిబాబు, డేగల శ్రీనివాస్, కండవల్లి పెద్ద గుణ, షేక్ కరీముల్ల, బావవరం లక్ష్మణ్, ఎర్ర విక్రమ్ తదితర వేళంగి యువత, గ్రాడ్యుయేట్స్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గూడూరు సీపీఐ కన్వీనర్, కో కన్వీనర్లుగా సునీల్, నారాయణ





**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణ సీపీఐ పార్టీ కన్వీనర్‌గా యాదాల సునీల్‌ను పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కో కన్వీనర్‌గా కే.నారాయణను ఎంపిక చేశారు. బుధవారం నియోజకవర్గ సమితి సమావేశం పట్టణంలోని కటకరాజా వీధిలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు సీవీఆర్. కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న సునీల్, నారాయణను నాయకులు అభినందించారు. ఈ సమావేశంలో సమకాలిన పరిస్థితులు, సీపీఐ చేపట్టాల్సిన పోరా టాలపై చర్చించారు. పట్టణ కన్వీనర్‌గా ఎంపికైన సునీల్ మాట్లా డుతూ పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జితో పాటు అనేక ప్రజా సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. ఆయా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కో కన్వీనర్ నారాయణ మాట్లా డుతూ దళిత, బడుగు బలహీన వర్గాల సమస్యలపై రాజీలేని పోరా టం కొనసాగిస్తామన్నారు. ఈ పదవికి సిఫార్సు చేసిన ప్రభాకర్, కుమార్, శశిలకు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, రైతు సంఘం జిల్లా నాయ కులు సీవీఆర్. కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి జమాలుల్లా షేక్, ఏఐటీయూసీ నియోజకవర్గం కార్యదర్శి కె.నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, యస్వంత్, మీరా తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

**9440662699, rajadhanivartalu.com**

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, ఇతర రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు చర్యలు

**గుంటూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, ఇతర రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా రైల్వే, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థల సమన్వయంతో నిరంతరం సమీక్షిస్తూ పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, మేయర్ కొవెల మూడి రవీంద్రతో కలిసి జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జలు, ఇతర రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్వోబి ఫౌండేషన్ పనులు జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు. నంది వెలుగు ఆర్వోబీ పనులు పూర్తిచేసి జూన్ చివరి నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. పెదపకలూరు, నంబూరు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు టెండర్లు పూర్తయినందున పనులు ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, అర్వోబి రివైజ్డ్ ప్రతిపాదనలకు మార్చి 31 నాటికి ఆమోదించి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. శ్యామల నగర్ ఆర్వో బి నిర్మాణానికి రైల్వే, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో భూసేకరణ ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా నిడమర్రు, నెహ్రూ నగర్, ఎర్రబాలెం, నిడుబ్రోలు వద్ద మంజూరు చేసిన



ఆర్వోబీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. నెహ్రూ నగర్ నుంచి మణీపురం వరకు డ్రైయిన్ నిర్మాణానికి నగరపాలక సంస్థ, రైల్వే అధికారులు సమన్వయంతో ఆక్రమణల తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడ నివసిస్తున్న వారికి ప్రత్యామ్నాయంగా పూర్తి స్థాయిలో టిడ్కో, హౌసింగ్ లే అవుట్‌లలో ఇళ్ళు కేటాయించాలన్నారు. అమృత్ భారత్ పథకం ద్వారా గుంటూరు, మంగళగిరి, తెనాలి రైల్వే స్టేషన్ లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రైల్వే స్థలాలోని నివాసాలను రెగ్యూలైజేషన్ చేయటానికి, రైల్వే శాఖకు కావాల్సిన స్థలాలపై ప్రతిపాదనలు అందించాలన్నారు. సమీక్షా సమావేశం అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతం చేయటానికి రైల్వే, ఆర్అండ్‌బి, మున్సిపల్ కమిషనర్ మరియు కాంట్రాక్టర్లతో సమన్వయ సమావేశంలో నిర్వహించి చిన్న చిన్న ఇబ్బందులను అదిగమించేలా చర్యలు సూచించామన్నారు. నంది వెలుగు బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని, జూన్ చివరి నాటికి పనులు పూర్తి అవుతాయన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జికి సంబంధించిన రైల్వే పిల్లర్లు, గార్డర్లు, ఫ్యాబ్రికేషన్ పనులకు రైల్వే అనుమతులు మార్చి 15వ తేదీలోగా రైల్వే అధికారులతో మాట్లాడి అనుమతులు క్లియర్ చేయాలని నిర్ణయించారన్నారు. గ్రావెల్ కొరత సమస్యను పరిష్కరించడానికి మైనింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించామన్నారు. నల్లపాడు బండారుపల్లి పెదపలకలూరు వద్ద, మంగళగిరి-నంబూరు స్టేషన్ నంబూరు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు ఏప్రిల్ మొదటి వారంలో రైల్వే సహాయ మంత్రి సోమన్నతో శంకుస్థాపన చేయించాలన్నా ఆలోచనలో ఉన్నామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ బ్రిడ్జి డిజైన్లలో మార్పుల కారణంగా ఆలస్యం అయిందని, త్వరలోనే టెండర్లుకు వెళ్ళేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్యామలా నగర్ బ్రిడ్జికి జిఐడి ఆమోదం లభించింది. ఇది ఒక ముఖ్యమైన ప్రాజెక్టు అని మున్సిపల్ కమిషనర్ మరియు మేయర్ రైల్వే అధికారులను సమన్వయం చేసుకొని భూసేకరణ ప్రక్రియను పూర్తి చేస్తే టెండర్లు పిలుస్తారని తెలిపారు. మూడు వంతెనల వద్ద వర్షాలు పడినప్పుడు నీరు నిలిచిపోతుందని దీనికి పరిష్కారంగా నెహ్రూ నగర్ నుంచి మణిపురం బ్రిడ్జి వరకు డ్రైయిన్ నిర్మణానికి పనులు ప్రారంభించామన్నారు. ఇక్కడ స్థలంను ఆక్రమించి 90 మంది వరకు నివాసం ఉంటున్నారని వారికి ఇబ్బంది ఉండకూడదని టిడ్కోలోను, కొర్నెపాడులోని హౌసింగ్ లేఔట్లలో ఇల్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. అయితే ఇక్కడ నివాసం ఉంటున్న వారికి పునరావాసం కల్పిస్తున్నారని ఇటీవల కొంతమంది నూతనంగా వచ్చి స్థలాలు ఆక్రమించి ఇల్లు నిర్మించుకుంటున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇటువంటి వాటిని ఉపేక్షించమని చర్యలు తీసుకుంటామన్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్లలో మంగళగిరి మరియు తెనాలి స్టేషన్లు పూర్తయ్యాయని చెప్పారు. గుంటూరు స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని, ఒక సంవత్సరంలో పూర్తి అవుతాయన్నారు. అప్పటి వరకు రైల్వే స్టేషన్‌లో వెస్ట్ వైపు వెయిటింగ్ హాల్ తో పాటు వేసవిని దృష్టిలో ఉంచుకుని నీడ కోసం క్యానోపీ షేడ్ వేయాలని రైల్వే అధికారులకు సూచించామన్నారు. తెనాలికి వందే భారత్ రైలు ప్రపోజల్స్ రైల్వే బోర్డు వద్ద పెండింగ్‌లో ఉందని ఈ ప్రపోజల్‌ను ఫాలో అప్ చేస్తున్నామన్నారు. రైల్వే, ఆర్అండ్‌బి, మున్సిపల్ కమిషనర్ మరియు కాంట్రాక్టర్ల మధ్య సమన్వయంతో గుంటూరు ప్రాంతంలో రైల్వే ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, తెనాలి ఇన్చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఆర్డీవో శ్రీనివాసులు, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, ఎడిఆర్ఎం రమేష్, ఎడిఎన్ సతీష్, డీఈఎన్ సైమన్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# గూడూరులో ఘరానా మోసం

**- కోట్లు తస్కరించి రతన్ జూయలరీ నిర్వాహకుల పరార్ - న్యాయం చేయాలని రోడ్డెక్కిన బాధితులు**



ప్రభాతదర్శిని, (గూడూరు – ప్రతినిధి): గూడూరు ఘరానా మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గూడూరు రాజా వీధిలో ఉన్న రతన్ జూయలరీ నిర్వాహకుడు మనీష్ అనేక మంది దగ్గర బంగారు ఆభరణాలు చేయిస్తానని నగలు తీసుకుని ఉడాయించాడు. బుధవారం బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాసిన భాస్కర్ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జ్ ఎల్వీ. సుబ్బయ్య, పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వర్లు రాజు బాధితులతో పాటు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇక్కడే స్థిరపడిన రతన్ జూయలరీ బంగారు దుకాణం నిర్వాహకులు మనీష్ బంగారు ఆభరణాలు చేస్తానని కొంతమంది వద్ద నగలు తీసుకున్నాడని, మరికొంతమంది నగలు కుదువకు పెట్టుకుని, బాధితులు డబ్బులు చెల్లించినా నగలు ఇవ్వకుండా తిప్పించుకున్నాడని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే నగలు కావాలా, న్యాయం కావాలా అంటూ నెలల తరబడి కాలయాపన చేస్తూ న్యాయం చేయలేదని ఆరోపించారు. ఎల్వీ. సుబ్బయ్య మాట్లాడుతూ 30 మంది వరకూ బాధితులున్నట్లు తెలి సిందన్నారు. వారందరిని సమీకరించి న్యాయం కోసం త్వరలోనే జిల్లా ఎస్పీని కలుస్తామన్నారు.

బీఎస్పీ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు రాజు మాట్లాడుతూ ప్రసన్న వెంకటేశ్వర స్వామి నగదు కూడా 15 లక్షలు మనీష్‌కు వడ్డీకి ఇచ్చినట్లు తెలిసిందన్నారు.

చివరికి ఇళ్లు కూడా ఎవరికీ చెప్పకుండా అమ్మేసి పరారయ్యాడని ఆరోపించారు. వెంటనే న్యాయం చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గూడూరు, చెన్నూరు, నాయుడుపేట ప్రాంతాల బాధితులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan